సూర్య 18వ వసంతంలోకి...
visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

బుధవారం | 25 సెప్టెంబర్ 2024 | విజయవాడ

సంపుటి 17 | సంచిక 295
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi




అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - వర్ష ఋతువు, భాద్రపద మాసం బ. అష్టమి సా.4.58, ఆరుద్ర రా.3.33, వర్జ్యం మ.12.02 నుంచి 1.38 వరకు
రాహుకాలం మ.12.00 నుంచి 1.30 వరకు దుర్ముహూర్తం ఉ.11.39 నుంచి 12.31 వరకు

## ప్రధాని మోడీ అమెరికా పర్యటన
# విజయవంతం

### అమెరికా సహా పలు దేశాలతో కీలక ఒప్పందాలు

● ప్రపంచ నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలు ● ఎందరో దేశాధినేతలు.. మరెందరో సీఈవోలతో భేటీ ● భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని అవకాశాలను తెలియజేసిన మోడీ ● ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో 3 నెలల వ్యవధిలో మూడోసారి మోడీ భేటీ ● ఉక్రెయిన్ కోరిక మేరకు జెలెన్ స్కీతో సమావేశం..45 నిమిషాల పాటు చర్చలు ● యుద్ధం ముగించడానికి ఏదో ఒక పరిష్కారం కనుగొనాలి

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడు రోజుల అమెరికా పర్యటన విజయవంతంగా ముగిసింది, మోదీ యూఎస్ పర్యటనలో క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొనడం, యూఎన్ జనరల్ అసెంబ్లీలో 'సమ్మిట్ ఫర్ ది ఫ్యూచర్' కార్యక్రమంలో ప్రసంగించడంతోపాటు అనేక మంది ప్రపంచ నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. అమెరికా పర్యటనలో చివరి రోజు బిజీబిజీగా గడిపారు ప్రధాని మోదీ.. అమెరికా టెక్ కంపెనీలు భారత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ప్రధాని మోదీ తన అద్భుతమైన పర్యటన ముగించుకుని న్యూఢిల్లీకి తిరిగి వస్తున్నారని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. అమెరికా పర్యటనలో ప్రధాని మోడీ ఎజెండా అనేక ముఖ్యమైన కార్యక్రమాలతో నిండిపోయింది.



6లో

## ఎన్ఆర్ఐ కోటా మోసం

● ఎంబీబీఎస్ ప్రవేశ నిబంధనపై సుప్రీంకోర్టు ● పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు షాక్ ● కోటా కింద అడ్మిషన్‌లో బంధువులను చేర్చుకోవడం సరికాదు ● ఇది డబ్బు సంపాదించుకునేందుకు ఒక ఎత్తుగడ ● దీని ద్వారా విద్యా వ్యవస్థ బలహీనపడుతుంది : సుప్రీంకోర్టు

ఎంబీబీఎస్‌లో ఎన్ఆర్ఐ కోటా కింద అడ్మిషన్ల విషయంలో పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్ఆర్ఐ కోటా నిర్వచనాన్ని విస్తరించాలన్న నిర్ణయాన్ని రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పంజాబ్ ప్రభుత్వం చేసిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది



6లో

### నేడే జమ్మూ కశ్మీర్‌లో రెండో విడత పోలింగ్

● భారీ పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన భద్రత ● ఈవీఎంలతో పోలింగ్ బూత్ లకు చేరుకున్న సిబ్బంది ● ఆరు జిల్లాల్లో 26 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ● ఈనెల 18న తొలిదశలో 24 నియోజకవర్గాల్లో 61.13 శాతం ఓటింగ్



6లో

### వైసీపీకి షాక్ ఇచ్చిన
## ఆర్.కృష్ణయ్య



2లో

### కర్ణాటక సీఎంకు
## హైకోర్టు షాక్

● గవర్నర్ చర్యలను సమర్థించిన హైకోర్టు ● ముడా భూ కుంభకోణంలో సీఎంను విచారించేందుకు అనుమతించిన గవర్నర్ ● గవర్నర్ చర్యలను సవాల్ చేసిన సీఎం సిద్ధరామయ్య

6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### రియల్ టైం గవర్నెన్స్ సెంటర్‌తో
## పౌరసేవలు సులభతరం

● పాలనలో వేగం పెంచడంపై అధికారులతో చర్చ ● ఆర్టీజీ ద్వారా మెరుగైన సేవలు అందించే ప్రాజెక్టును 100 రోజుల్లో సిద్ధం చేయాలని సీఎం ఆదేశం
● ఆర్టీజీని సందర్శించిన చంద్రబాబు నాయుడు

సచివాలయంలోని మొదటి బ్లాక్ లో ఉన్న రియల్ టైం గవర్నెన్స్ సెంటర్ ను సీఎం చంద్రబాబు నాయుడు సందర్శించారు. గత టీడీపీ హయాంలో ఈ రియల్ టైం గవర్నెన్స్ సెంటర్ ను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థను పక్కన పెట్టింది. 2024లో ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన తరవాత తొలి సారి మంగళవారం సీఎం చంద్రబాబు ఆర్టీజీ సెంటర్ ను సందర్శించారు.



2లో

## తిరుమలలో ల్యాబ్ లేదా?

● అయితే 2014-19 మధ్య నెయ్యి కల్తీ జరిగిందా? ● బాబు కల్తీ నాటకం అంటూ వైసీపీ లాజిక్ ట్వీట్ వైరల్



7లో

తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యి వాడినట్లు ఇటీవల జరిపిన పరీక్షల్లో తేలడం కోట్లాది భక్తులను ఆందోళనకు గురిచేసింది. అయితే కూటమి ప్రభుత్వం, ఏపీ సీఎం చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే కల్తీ నాటకాన్ని తెర మీదకు తెచ్చారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల అన్నారు. వంద రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజాగ్రహాన్ని డైవర్షన్ చేయడంలో భాగంగా తిరుమల వివాదాన్ని తెరపైకి తెచ్చారని జగన్ చెబుతున్నారు.

### తిరుమల వ్యవహారంపై సిట్ ఏర్పాటు

● చీఫ్‌గా ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నియామకం
● ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం
● సిట్ బృందంలో పలువురు కీలక అధికారులకు చోటు



7లో

### అంతా ఇంతే!




సిట్ విచారణలో ఎంతమంది స్టాండ్ అవుతారో చూడాలి

### రైతుల సంక్షేమమే
## ప్రభుత్వ ధ్యేయం

● రైతులు నూతన ఆధునిక పద్ధతులు పాటించాలి ● ప్రతి రైతు ఆధునిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించాలి ● రైతులకు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు ● రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చిన్నమండెం మండలం, మల్లూరు గ్రామంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేస్తోందన్నారు. రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించి అభివృద్ధి చెందాలన్నారు.

### ఇకపై లాభసాటిగా
## వ్యవసాయం

● ఎక్కువ దిగుబడి లక్ష్యంగా "పొలం పిలుస్తోంది"
● ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన ● రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సూచనలు ●పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్



2లో

అన్నదాతను ఆదుకోవడమే లక్ష్యంగా సాగులో పెట్టుబడులు తగ్గించి, పంటల దిగుబడితో, రైతన్న ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

### ఐరాస వేదికపై గళమెత్తిన
## భారత మహిళ



6లో

● వేతనంతో కూడిన నెలసరి సెలవు కావాలి ● ఒడిశాకు చెందిన ఉద్యమకారిణి రంజితా ప్రియదర్శిని ● నెలసరిపై సమాజంలో అపోహలు తొలగించే పోరాటం చేస్తున్న రంజిత ● జీతం ఇవ్వకపోతే.. ఏ మహిళ కూడా ఆ సెలవు తీసుకోదు : ప్రియదర్శిని

# గత ప్రభుత్వంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు: మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: అతి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇచ్చే సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ వివరించారు. ధాన్యం బకాయిలు వైసీపీ ప్రభుత్వం చెల్లించకపోవడంతో కూటమి ప్రభుత్వం రూ. 1600 కోట్ల రైతు బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. ఆధునిక టెక్నాలజీ డ్రోన్ ద్వారా పంటలకు పురుగు మందులు పిచికారీ చేసే విధానంతో మేలు జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రైతు భరోసా చెల్లిస్తున్నాయని భూపతి రాజు శ్రీనివాస్ వర్మ స్పష్టం చేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. రైతులకు చెల్లిస్తానని చెప్పిన ఇన్సూరెన్స్ చెల్లించకపోవడంతో విపత్తులకు రైతులు నష్టపోయారని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కరుగోరుమిల్లిలో ఇవాళ(మంగళవారం) 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ... తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇచ్చే సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని వివరించారు. ధాన్యం బకాయిలు వైసీపీ ప్రభుత్వం చెల్లించకపోవడంతో కూటమి ప్రభుత్వం రూ. 1600 కోట్ల రైతు బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. ఆధునిక టెక్నాలజీ డ్రోన్ ద్వారా పంటలకు పురుగు మందులు పిచికారీ చేసే విధానంతో మేలు జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రైతు భరోసా చెల్లిస్తున్నాయని స్పష్టం చేశారు. నకిలీ పురుగు మందులు, నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ హెచ్చరించారు.



# లౌకిక వాదం వన్ వే కాదు టూ వే

● సనాతన ధర్మానికి భంగం వాటిల్లితే కచ్చితంగా మాట్లాడతాము ● సనాతన ధర్మ పరిరక్షణకు ప్రాణాలిచ్చేందుకైనా సిద్ధం ● సనాతన ధర్మానికి హాని కలిగితే హిందువులందరూ కలసికట్టుగా మాట్లాడాలి... మౌనం మంచిది కాదు ● లడ్డూ అపవిత్రంపై వైసీపీవాళ్ళ మాటలు మరింత వేదన కలిగిస్తున్నాయి ● తప్పును ఒప్పుకోకుండా బుకాయింపులతో కాలం గడపాలని చూస్తున్నారు ● ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా విజయవాడ కనుకదుర్గమ్మ ఆలయంలో శుద్ధి కార్యక్రమం ● కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో అపవిత్రం జరిగితే వైసీపీ నాయకులు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. జగన్ నియమించిన టీటీడీ బోర్డులో తప్పు జరిగిందని ల్యాబ్ రిపోర్టులతో సహా విషయం బయటకు వచ్చినా దబాయించడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. తప్పు జరిగినప్పుడు దానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటామని మాట్లాడాలి లేదా అప్పటి బోర్డులో ఉన్న అధికారులు, బోర్డు సభ్యులు ప్రమేయం మీద మాట్లాడాలి గాని ఇష్టానుసారం మాట్లాడడం సరికాదన్నారు. సనాతన ధర్మానికి భంగం వాటిల్లితే హిందువులంతా కలసికట్టుగా మాట్లాడాలనరు. ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా మంగళవారం విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయం మెట్లను కడిగి శుభ్రం చేశారు, పసుపు రాశారు. అనంతరం కనక దుర్గమ్మవారి దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ. అన్ని మతాలు, అన్ని ధర్మాలు, అన్ని విశ్వాసాలను సమానంగా గౌరవించే నేల మనది అన్నారు. కోట్లాది మంది హిందువులు పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ అపవిత్రం అయితే వైసీపీ నాయకులు బాధ్యతరాహిత్యంగా మాట్లాడుతున్నారన్నారు. గతంలో దుర్గగుడిలో వెండి సింహాలు మాయమైన సందర్భంగా ఆ విషయాన్ని అప్పటి వైసీపీ నాయకులు అవహేళన చేస్తూ మాట్లాడారు.

**వైసీపీ పాలనలో వందల ఆలయాలు ధ్వంసం...**

వైసీపీ హయాంలో వందలాది ఆలయాలను ధ్వంసం చేశారన్నారు పవన్ కళ్యాణ్. దేవతల విగ్రహాలను అపవిత్రం చేశారన్నారు. ఈ దేశంలో సెక్యులరిజం అనేది వన్ వే కాదు రెండు వైపుల నుంచి ఉండాలన్నారు. ఇతర మతాల ఆచారాలకు, సంప్రదాయాలకు విఘాతం కలిగితే ఎలా స్పందిస్తున్నారో



హిందువుల మనోభావాలకు, ఆచారాలకు, సంప్రదాయాలకు, ధర్మాలకు విఘాతం కలిగినా అంతే స్థాయిలో స్పందించాలన్నారు. ఈ దేశంలో అన్ని మతాలకు సమాన హక్కులున్నాయన్నారు. తిరుమల ఘటనలాంటి ఘటన ఏ మసీదులోనో, చర్చిలోనో జరిగితే ఇలానే మాట్లాడతారా ? ఇస్లాం మీద గొంతెత్తితే రోడ్ల మీదకు వచ్చి కొడతారని భయమన్నారు. సున్నితాంశాలపై నటుడు ప్రకాశ్‌రాజ్ విషయం తెలుసుకుని మాట్లాడాలన్నారు. ప్రకాశ్ రాజ్ మాత్రమే కాదు ఆయనతోపాటు అందరికీ చెబుతున్నా విమర్శలకు ముందు ఏం జరిగిందో తెలుసుకోండి. సాటి హిందు వులను తోటి హిందువులు తూలనాడడం మానుకోవాలి. హిందువులంతా సనాతన ధర్మానికి ఏ మాత్రం విఘాతం కలిగినా కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు.

**పొన్నవోలు మదమెక్కి మాట్లాడుతున్నారు...**

లడ్డూ అపవిత్రం అయిందని మేము మాట్లాడితే హైకోర్టు ఏజీపీగా పని చేసిన పొన్నవోలు సుధాకర్ రెడ్డి మదం ఎక్కిన మాటలు మాట్లాడుతున్నారన్నారు. రాగి చెంబు తయారీలో బంగారం కలపరు అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఆయన కూడా హిందువే. హిందూ ధర్మం పాటించే ప్రజలు పవిత్రంగా భావించే లడ్డుకి అపచారం జరిగితే సాటి హిందువుగా ఇలాంటి మాటలు మాట్లాడడం దారుణం. వైవీ. సుబ్బారెడ్డిని విచారణకు రమ్మంటే రికార్డులు నాకు పంపించండి అన్ని అడుగుతున్నారు. మీ హయాంలో తప్పు జరిగితే దానికి సంబంధించిన ఫైల్స్ మీకు ఇవ్వాలా..? మీ హయాంలో ఇలాగే ఇచ్చారా..? అని ప్రశ్నించారు. కరుణాకర రెడ్డి తిరుమలలో పెద్ద యాక్టింగ్ చేశారన్నారు. ఈవో ధర్మారెడ్డి ఎక్కడున్నారో కూడా తెలియదన్నారు. ఆయన హయాంలో తిరుమలను వ్యాపార, పర్యాటక కేంద్రంగా మార్చేశారన్నారు. ధర్మారెడ్డి కొడుకు చనిపోతే కనీసం 11 రోజులు కూడా ఆలయంలోకి వెళ్లకుండా ఉండలేకపోయారు. ఆగమశాస్త్రం పాటించే తిరుమలలో ఆయన ఇష్టానుసారంగా ప్రవర్తించారు.

**హిందువులకు చేతులెత్తి మొక్కుతున్నాను...**

హిందువు అనే వాడికి ఈ దేశంలో భయం ఉండదన్నారు. అలాగే ఇతర మతాలపై ద్వేషం ఉండదు. హిందువులకు కూడా చేతులెత్తి మొక్కుతున్నానన్నారు. సనాతన ధర్మ రక్షణ కోసం తుది వరకు పోరాడుతానన్నారు. అవసరమైతే ప్రాణం కూడా ఇవ్వడానికి సిద్ధమన్నారు. సినిమా ఇండస్ట్రీ వారికి కూడా పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మానికి సంబంధించిన విషయాల్లో ఇష్టానుసారం జోకులు వేయడం దాన్ని మీమ్స్ చేయడం సరికాదన్నారు.

**పవన్‌కళ్యాణ్‌కి పూర్ణ కుంభంతో స్వాగతం...**

విజయవాడలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ శుద్ధి కార్యక్రమానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్‌కి ఆలయ అధికారులు, వేద పండితులు శాస్త్రోక్తంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి నడక మార్గంలో వచ్చే మెట్లను శ్రీ పవన్ కళ్యాణ్ గారు కడిగి, శుభ్రం చేసి పసుపు, కుంకుమ పెట్టారు. కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ కి ఆలయంలోనే వేదపండితులు ఆశీర్వచనం అందించి దీవించారు.

**హిందువుల మనోభావాలు పట్టవా?**
**– కేశినేని శివనాథ్, విజయవాడ ఎంపీ**

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ వైసిపి నాయకులకు హిందువులు మనోభావాలు అంటే చిన్న చూపు అన్నారు. ఎంతో పవిత్రంగా భావించే లడ్డులో జంతువుల కొవ్వు అవశేషాలు ఉన్నాయన్న వార్త ప్రపంచంలో హిందువులందరి మనోభావాలను దెబ్బతీసిందన్నారు. వైసీపీ పాపాలు సాక్ష్యాలతో బయటకు వచ్చినా అడ్డుగోలుగా దబాయించాలని చూస్తున్నారన్నారు.



తిరుమల లడ్డూ పరమ పవిత్రంగా భావిస్తాం
– వల్లభనేని బాలశౌరి , మచిలీపట్నం ఎంపీ

మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనం తర్వాత ఆయనకు నివేదించిన లడ్డూను అంతే పవిత్రంగా చూస్తామన్నారు. లడ్డూ అంటే భక్తులకు అంత సెంటిమెంటన్నారు. అలాంటి పవిత్రమైన ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీ పాలకుల తప్పిదాలను ప్రజలు మర్చిపోరన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వైసీపీ పాలన సాగిందన్నారు. టీటీడీ అధికారులు చేసినదాన్ని తప్పిదం అనకూడదన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడే వ్యక్తిగా పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తే... వైసీపీ నాయకులు చేసిన తప్పుకు కనీసం బాధపడకపోవడం శోచనీయమన్నారు.

**– పరమత సహనం పవన్‌కళ్యాణ్**
**– పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్సీ**

శాసనమండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని పాటిస్తూ... పరిమత సహనాన్ని చూపించే గొప్ప నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం ఇంత అపవిత్రం అయిందనే విషయం తెలుసుకొని ఎంతో ఆవేదన చెందారన్నారు. ఇలాంటి విషయాలపై వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు మరింత వేదనకు గురి చేస్తున్నాయన్నారు. ప్రతి హిందూ ఈ సమయంలో స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కళ్యాణం శివ శ్రీనివాస్, పార్టీ చేనేత వికాస విభాగం ఛైర్మన్ శ్రీ చిల్లపల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, బాడిత శంకర్, కూటమి నేతలు పాల్గొన్నారు.

# హిందూ దేవాలయాలపై, స్వామివారి రథాలపై కన్నేసిన దుండగులు

● హిందూ దేవాలయాలే లక్ష్యమా? హనకానహాల్ సీతారామాంజనేయ రథంపై దుండగుల దుశ్చర్య ● నాలుగు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్న పోలీసులు



లిడి. హీరేహాళ్ మేజర్ న్యూస్ : అనంతపురం జిల్లా కనేకల్ మండలం హనకానహాల్ గ్రామంలో రాముల ఆలయ రథంపై సోమవారం అర్ధరాత్రి దుశ్చర్యానికి పాల్పడిన ఘటన గ్రామంలో చోటుచేసుకుంది. హిందూ దేవాలయాలపైనే కన్నేసిన దుండగులు, అపచారానికి ఒడిగడుతున్న మతోన్మాదులు ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటా రెండా గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం లో హిందూ దేవాలయాలపై, వాటి రథోత్సవాలపై కన్నేసి దుచ్చర్యానికి పాల్పడ్డారు. అప్పటి ప్రభుత్వం ఎన్ని దాడులు దేవాలయాలపై అపచారాలు జరుగుతున్న కూడా పట్టించుకోకపోవడంతో సనాతన ధర్మ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే ఇలాంటివి ఈ దుశ్చర్యాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. వివరాలుఇలా ఉన్నాయి.అనంతపురం జిల్లా కనేకల్ మండలం హనకానహాల్ గ్రామంలో సోమవారం రాత్రి సీతారామాంజనేయుల ( వీరాంజనేయ) రథంపై దుండగులు నిప్పంటించి దుశ్చర్యానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో రథం పూర్తిగా దెబ్బతిని కాలిపోయింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కనేకల్ మండలంలోని హనకానహాల్ గ్రామంలో కొలువుండే సీతారామాంజనేయ రథోత్సవాన్ని గ్రామంలో ఉండేది. దీంతో గ్రామంలో కొందరు దుండగులు మతోన్మాదులు దుశ్చర్యానికి ఒడికట్టి మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఎక్కడ బయటికి రాకుండా పోలీసులు నిఘా నియంత్రణ ఏర్పాటు చేస్తున్నట్లు పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోనే గతంలోనూ రాయదుర్గం మండలం చదం సమీపంలో వెలిసిన ఓ ఆలయంలో కూడా దుండగులు దుశ్చర్యానికి పాల్పడిన , రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా పలు ఆలయాల్లో చోరీలు, రథోత్సవాలపై, ఆలయాల్లో విగ్రహాలపై కొందరు దుండగులు దుశ్చర్యానికి ఒడి కడుతున్నారు. ఈ నేపథ్యంలో హిందూ మత సనాతన ధర్మానికి వ్యతిరేకంగా, గ్రామాల్లో ఉండే కొంతమంది మతోన్మాదులు ఇలాంటి దుచ్చడానికి పాల్పడే అవకాశం ఉన్నట్లు గ్రామస్తులు తెలియజేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో కొలువుదీరిన సీతా రామాంజనేయ స్వామి రథోత్సవం పై ఎన్నడూ లేని విధంగా సోమవారం రాత్రి జరిగిన ఘటన గ్రామమంతా నిప్పు రగులై విగిసిపడుతుంటే పోలీసులు మాత్రం ఇక నీడ జాడ లేకుండా ప్రయత్నం చేస్తామన్నారు. శాంతియుతంగా ఉండే గ్రామాలలో మతోన్మాదులు, సనాతన ధర్మానికి చిచ్చు పెట్టే ప్రయత్నం జరుగుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా ఇలా హిందూ ఆలయాలపై, రథోత్సలపై దుశ్చర్యాలకు , దిగజారుడు తనానికి వెళ్తున్నారని పలువురు సనాతన ధర్మ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. పచ్చగా ఉండే గ్రామాల్లో చిచ్చుపెట్టే ప్రయత్నం ఇది ఒకటి భాగంగా జరుగుతుందని ఇలాంటి మతోన్మాదులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఆలయ కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఆదేశాల మేరకు కళ్యాణ్ దుర్గం డిఎస్పి రవిబాబు ఆధ్వర్యంలో రాయదుర్గం సిఐలు ఇద్దరు నాలుగు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా దుండగులు కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

DBS

**వేలం ప్రకటన**

మా బ్యాంక్ యొక్క దిగువ పేర్కొన్న జ్యువెల్ లోన్ కస్టమర్‌లు మా రిమైండర్‌లు మరియు రిజిస్టర్డ్ అడ్రస్ కారణంగా రసీదుతో కూడిన రిజిస్టర్ చేసిన పోస్ట్‌ను ఇప్పటికే వారికి పంపిన తర్వాత కూడా వారి రుణ ఖాతాలను సెటిల్ చేయడంలో విఫలమయ్యారని సమాచారం. పూర్తి రుణ మొత్తాన్ని 07.10.2024న లేదా అంతకు ముందు సెటిల్ చేయకపోతే, కస్టమర్ తాకట్టు పెట్టిన సెక్యూరిటీలు 07.10.2024న ఉదయం 11.00 గంటలకు లేదా బ్యాంకుకు అనుకూలమైన మరేదైనా తేదీకి వేలం ద్వారా విక్రయించబడతాయి.తదుపరి నోటీసు లేకుండా మరియు బ్యాంక్ ప్రాంగణంలో లేదా ఈ-వేలం ప్లాట్‌ఫారమ్‌లో బహిరంగ వేలం విక్రయం ద్వారా బ్యాంక్ యొక్క పూర్తి సంతృప్తి కోసం. https://egold.auctiontiger.net

| Ref. No. | కస్టమర్ పేరు | బ్రాంచ్ పేరు | స్థూల ఆదాయం | నికర ఆదాయం |
|---|---|---|---|---|
| 81436552 | ఉమ్మడి లక్ష్మన్ | MVP కాలనీ, వైజాగ్ | 10.53 | 9.99 |
| 80935784 | బుర్లి లక్ష్మన్ రావు | విజయనగరం | 31.27 | 25.99 |

తేది : 23.09.2024
స్థలం : చెన్నై
అధీకృత అధికారి
డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్

* DBS బ్యాంక్ ఇండియా లిమిటెడ్ అనేది DBS బ్యాంక్ లిమిటెడ్ సింగపూర్ నుండి పూర్తి లైసెన్స్ క్రింద అనుబంధ సంస్థ

# రాష్ట్రంలో ప్రతీ రైతు సంతోషంతో వ్యవసాయం చేసేలా ప్రత్యేక విధానం

● సాగులో ఆధునిక టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహిస్తాం
● వ్యవసాయాధికారులు ప్రతీరోజు గ్రామాలలో
● చిన్న,సన్నకారు రైతులను అవగాహన పరచాలి
● రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిరాష్ట్రంలోని ప్రతీ రైతు సంతోషంతో వ్యవ సాయం చేసేలా ప్రత్యేక విధానాన్ని రూపొందించేందుకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఆగిరి పల్లి మండలం సగ్గూరు లో మంగళవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తోకలిసి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వ్యవసాయం, యువతకు ఉపాధికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. దేశమంతా పట్టణీకరణ, పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడం, తదితర కారణాలతోపాటు వ్యవసాయ పనులలో కూలీల కొరత ఒక కారణంగా వ్యవసాయం వైపు ఎవరూ మొగ్గుచూపడంలేదన్నారు. ప్రతీ రైతు సంతోషంతో వ్యవసాయం చేయడమేకాక, యువతను వ్యవసాయం వైపు మరల్చేందుకు వరి నాటు యంత్రాలు, పంటకోత మిషన్లు, డ్రోన్ల ద్వారా ఎరువులు పురుగుమందులు చల్లడం వంటివి సాగులో ఆధునిక టెక్నాలజీని ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా డ్రోన్లలో కృత్రిమ మేధస్సు సాఫ్ట్వేర్ అభివృద్ధి చేసేలా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదన్నారు. వీటిని కొనుగోలుకు రైతులకు ప్రభుత్వం 50 శాతం వరకు సబ్సిడీ ని అందిస్తుందని మంత్రి తెలిపారు. వ్యవసాయంలో రాష్ట్రంలో 70 నుండి 80 శాతం మంది కౌలు రైతులేనని, బ్యాంకర్లు అందించే పంట రుణాలు లక్ష కోట్లలో కేవలం వెయ్యి నుండి 2 వేల కోట్ల మాత్రమే కౌలు రైతులకు రుణాలు అందిస్తున్నారని, ఈ పద్ధతిని మార్చి కౌలు రైతులందరికీ బ్యాంకర్లు రుణ సౌకర్యం కల్పించేలా సాగుచేసే కౌలు రైతుల పేరిట సంవత్సరం పాటు చెల్లుబాటు అయ్యేలా వ్యవసాయ శాఖాధికారులు ధ్రువీకరణ పత్రాన్ని జారీచేస్తారన్నారు. ఈ ధ్రువీకరణ పత్రం ఆధారంగా బ్యాంకర్లు రుణాలను మంజూరు చేస్తాయన్నారు. వ్యవసాయ పరిశోధనలు క్షేత్రస్థాయిలో పొలాల్లోకి వెళ్ళినప్పుడే పరిశోధనలకు సార్థకత చేకూరుతుందన్నారు.

వ్యవసాయ శాఖాధికారులు ప్రతీరోజు గ్రామాలలో పర్యటించి, సాగులో మెళకువలు, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, శాస్త్రవేత్తలు చేసిన సరికొత్త పరిశోధనలను చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కలిగించాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధనకు అవసరమైన మెళకువలను రైతులకు తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం సొమ్మును ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందన్నారు. ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే సమస్యను పరిశీలించి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వం రైతులకు ఇవ్వవలసిన ధాన్యం బకాయిల సొమ్మును 1640 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేసిందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు,వరదల కారణంగా ఆస్థి, పంట నష్టపోయిన వారికి 15 రోజులలోనే పరిహారం అందించడం జరుగుందని, ఈనెల 25వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పరిహారాన్ని బాధితుల ఖాతాలో జమచేస్తున్నారన్నారు. ఏలూరు జిల్లాలో 5786 మంది రైతులకు 7 కోట్ల రూపాయల పంటనష్ట పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాలో బుధవారం ముఖ్యమంత్రి వేస్తారన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే



పూర్తిచేసి నూజివీడు ప్రాంత రైతుల సాగునీటి కష్టాలను తీరుస్తానని మంత్రి పార్థసారధి చెప్పారు. తెలంగాణా ప్రభుత్వంతో మాట్లాడి నాగార్జునసాగర్ ద్వారా నూజివీడు ప్రాంత రైతులకు ప్రస్తుత వ్యవసాయ సీజన్లో సాగునీరు అందిస్తున్నామన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నూజివీడు నియోజకవర్గంలో చెరువులకు గండ్లు పడ్డాయని, వాటిని 32 కోట్ల రూపాయలతో మరమ్మత్తులు త్వరలోనే చేయిస్తామని మంత్రి పార్థసారథి ప్రజలకు హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ దేశానికీ వెన్నుముక రైతన్నని, జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా తక్కువ సాగు ఖర్చుతో అధిక దిగుబడి సాధనకు తీసుకోవలసిన ఉత్తమ యాజమాన్య పద్ధతులు గురించి వ్యవసాయాధికారులు ప్రతీ గ్రామానికి వెళ్లి రైతులకు అవగాహన కలిస్తారన్నారు. అనంతరం డ్రోన్ల ద్వారా పొలాల్లో ఎరువులు, పురుగుమందుల చల్లడం మంత్రి పరిశీలించారు.వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖాధికారులు ఏర్పాటుచేసిన స్టాల్స్ ను మంత్రి సందర్శించారు. కార్యక్రమంలో నూజివీడు ఆర్డీఓ వై. భవానీశంకరి, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక జేడీ లు హబీబ్ భాషా, డా. నెహ్రు బాబు, ఉద్యానవనాల శాఖ డిడి రామ్మోహన్, సూక్ష్మ సేద్య పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రవికుమార్, నూజివీడు వ్యవసాయాధికారి చాముండేశ్వరి, తాసిల్దార్ ప్రసాద్, ఎంపిడిఓ అబ్దుల్ సత్తార్, స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతీ రైతు సంతోషంతో వ్యవసాయం చేసేలా ప్రత్యేక విధానం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రతీ రైతు సంతోషంతో వ్యవసాయం చేసేలా ప్రత్యేక విధానాన్ని రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర గృహని ర్మాణ, సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తో కలిసి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మం త్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ సీఎం వ్యవసాయం, యువతకు ఉపాధికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. దేశమంతా పట్టణీకరణ, పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడం వంటి కారణాలతో వ్యవసాయ పనుల్లో కూలీల కొరత కారణంగా ఎవరూ వ్యవసా యం వైపు ఇంటరెస్ట్ చూపించడం లేదన్నారు. ప్రతీ రైతు సంతోషంతో వ్యవసాయం చేయడమే కాక, యువతను వ్యవసాయం వైపు తీసుకొచ్చేలా చూడాలన్నారు. ఆధునిక టెక్నాలజీని ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. డ్రోన్లలో కృత్రిమ మేధస్సు సాఫ్ట్ వేర్ అభివృద్ధి చేసేలా ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. వ్యవసాయ పరిశోధనలు క్షేత్రస్థాయిలో పొలాల్లోకి వెళ్ళినప్పుడే పరిశో ధనలకు సార్థకత చేకూరుతుందన్నారు. వ్యవసాయ శాఖాధికారులు ప్రతీరోజు గ్రామాలలో పర్యటించి, సాగులో మెళకువలు, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, శాస్త్రవేత్తలు చేసిన సరికొత్త పరిశోధనలను చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కలిగించాలన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఇవ్వవలసిన ధాన్యం బకా యిల సొమ్మును 1640 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేసిందన్నారు.ఇటీవల కురిసిన భారీ వర్షా లు,వరదల కారణంగా ఆస్తి , పంట నష్టపోయిన వారికి 15 రోజులలోనే పరిహారం అందించడం జరు గుందన్నారు. ఏలూరులో 5786 మంది రైతులకు 7 కోట్ల రూపాయల పంటనష్ట పరిహారాన్ని రైతుల ఖాతాలో బుధవారం ముఖ్యమంత్రి వేస్తారన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తిచేసి నూజివీడు ప్రాంత రైతుల సాగునీటి కష్టాలను తీరుస్తానని మంత్రి పార్థసారధి చెప్పారు. తెలంగాణా ప్రభుత్వంతో మాట్లాడి నాగార్జునసాగర్ ద్వారా నూజివీడు ప్రాంత రైతులకు ప్రస్తుత వ్యవసాయ సీజన్ లో సాగునీరు అందిస్తున్నామన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నూజివీడు నియోజకవర్గంలో చెరువులకు గండ్లు పడ్డాయని, వాటిని 32 కోట్ల రూపాయలతో మరమ్మత్తులు త్వరలోనే చేయిస్తామని మంత్రి పార్థసారథి ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ దేశానికీ వెన్నుముక రైతన్నని, జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా తక్కువ సాగు ఖర్చుతో అధిక దిగుబడి సాధనకు తీసుకోవలసిన ఉత్తమ యాజమాన్య పద్ధతులు గురించి వ్యవసాయాధికారులు ప్రతీ గ్రామానికి వెళ్లి రైతులకు అవగాహన కలిస్తారన్నారు.

# 30వ తేదీ వరకు హజ్ దరఖాస్తు గడువు పొడిగింపు

● మరోసారి గడువును పొడిగించిన కేంద్ర హజ్ కమిటీ ● గన్నవరం నుంచి వెళ్లే యాత్రికులకు రూ.లక్ష ప్రభుత్వ ఆర్థిక సాయం ● ఏపీ మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: హజ్ యాత్ర కోసం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2025 కు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువును మరోసారిపొడిగించినట్లు రాష్ట్రమైనార్టీసంక్షేమ న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.హజ్ దరఖాస్తుల ఫారంలను పూరించడానికి కేంద్ర హజ్ కమిటీ మొదట ఆగస్టు 13వ తేదీ నుంచి ప్రారంభించి చివరి తేదీ సెప్టెంబర్ 9వ తేదీ వరకు నిర్ణయించిందని, ఈ గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించిందని తెలిపారు.అయితే దరఖాస్తు గడువును ఈ నెల 30వ తేదీ వరకు మరోసారి కేంద్ర హజ్ కమిటీ పొడిగించినట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. హజ్ యాత్ర కోసం దరఖాస్తులు అన్నీ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించడం కోసం కేంద్రహజ్ కమిటీ దేశవ్యాప్త ప్రకటన చేయడం జరిగిందని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్లేందుకు ఇప్పటివరకు 1937 మంది ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు.ఇందులో 1589 దరఖాస్తులు అన్ని అంశాలతో కరెక్ట్ గా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తీసుకున్న చర్యల్లో భాగంగా ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ. లక్ష ఆర్థిక సాయం అందించబోతున్నట్లు తెలిపారు. విజయవాడ గన్నవరం ఎయిర్పోర్ట్ నుంచి హజ్ కి వెళ్లే రాష్ట్ర ప్రయాణికులకు మాత్రమే ఈ సౌలభ్యం ఉంటుందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ అవకాశాన్ని రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు.

**రాష్ట్రంలో రూ.105 కోట్లతో మైనారిటీ యూత్ ఎంపవర్మెంట్ కోసం మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సిలెన్స్**

రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, రూ 105 కోట్లతో మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సిలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా మైనారిటీ యువత నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు కార్యాచరణ అమలు చేయబోతున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. ఒక్కొక్క కేంద్రాన్ని రూ. 35 కోట్లతో మైనారిటీ జనాభా ఎక్కువ గల గుంటూరు, నంద్యాల, అనంతపురం జిల్లా కేంద్రాలలో నెలకొల్పనున్నట్లు తెలిపారు. నైపుణ్య అభివృద్ధి శిక్షణలో భాగంగా ఏ.ఐ మరియు డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అధిక డిమాండ్ ఉన్న అధునాతన కోర్సులలో మైనార్టీ యువతకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడం ద్వారా మైనార్టీలు ఆర్థికంగా ఎదిగేందుకు, స్వయం సమృద్ధి తో పరిశ్రమలు,వ్యాపార సంస్థలు, సాఫ్టువేర్ తదితర రంగాలలో అడుగుపెట్టి నిలదొక్కుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకునేందుకు దోహదపడుతుందని మంత్రి ఫరూక్ అన్నారు.

IIFL FINANCE

CIN: L67100MH1995PLC093797
Regd. Office: IIFL House, Sun Infotech Park, Road No. 16V, Plot No.B-23, Thane Industrial Area, Wagle Estate, Thane - 400604
Tel: (91-22) 41035000 • Fax: (91-22) 25806654
E-mail: reach@iifl.com • Website: www.iifl.com

**బంగారు ఆభరణాల వేలం యొక్క పబ్లిక్ నోటీసు**

మేము, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్ ("ఐఐఎఫ్ఎల్") డిఫాల్ట్ అయిన కస్టమర్ల బంగారు ఆభరణాలను వేలం వేస్తున్నామని, వారి రుణాలను క్రమబద్ధీకరించని లేదా బకాయి ఉన్న మొత్తాన్ని చెల్లించలేదని నిర్దిష్టంగా మరియు సాధారణంగా సంబంధిత రుణగ్రహీతలందరికీ తెలియజేయబడింది. రిజిస్టర్డ్ వేలం నోటీసులు మరియు పదేపదే రిమైండర్ల ద్వారా తెలియజేయబడింది. కింది రుణ ఖాతాలలో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలం **28.09.2024న** ఉదయం **10:00** గంటల నుండి క్రింది జిల్లా కేంద్రంలో **విజయవాడ-ఏలూరు రోడ్ జిఎల్, #44-1-41, 1వ అంతస్తు, ఎదురుగా: పోస్టాఫీసు, ఏలూరు రోడ్, గుణదల, విజయవాడ- 520 004, (ఆంధ్ర ప్రదేశ్).** నిర్వహించబడుతుంది. వేదిక లేదా తేదీలో ఏదైనా మార్పు (ఏదైనా ఉంటే) వేలం కేంద్రంలో ప్రదర్శించబడుతుంది. ఏ కారణం చేతనైనా ఇక్కడ పేర్కొన్న తేదీలో వేలం నిర్వహించలేకపోతే లేదా అదే రోజున వేలం పూర్తి కాకపోతే, ఐఐఎఫ్ఎల్ అదే నియమ నిబంధనలతో ఏదైనా తదుపరి తేదీలో పేర్కొన్న వేలాన్ని నిర్వహించడానికి లేదా కొనసాగించడానికి హక్కును కలిగి ఉంది. కస్టమర్ మరణించినట్లయితే, వేలానికి సంబంధించిన అన్ని షరతులు నామినీ/చట్టపరమైన వారసుడికి వర్తిస్తాయి.

**గోల్ లోన్ అ/ఇ నం:** GL29076202, GL29204888, GL29356590, GL29549915, GL29647747, GL29713843, GL30546650, GL25790730, GL25815663, GL27750966, GL27779491, GL28019378, GL28072277, GL28998219, GL29004832, GL29716799, GL29965300, GL29987050, GL30049734, GL30055286, GL30065023, GL30353763, GL30383517, GL30402587, GL30589806, GL30603006, GL32129582, GL26467422, GL27769849, GL27777364, GL28235424, GL28496619, GL28504538, GL28981172, GL29089164, GL29155826, GL29309393, GL29334016, GL29354582, GL29362156, GL29416351, GL29427782, GL29490081, GL29508536, GL29526035, GL29856944, GL29988496, GL30052347, GL30056575, GL30066949, GL30093723, GL30367217, GL30504438, GL30734319, GL20416301, GL24865286, GL25920572, GL26082357, GL26519959, GL27727110, GL29738734, GL30144882, GL30410581, GL30528796, GL30813335, GL28607994, GL28614867, GL30249122, GL30258208, GL30667121, GL32493070, GL27446322, GL27596358, GL27614728, GL27683310, GL27788654, GL28957087, GL28979674, GL29148789, GL29341311, GL29354606, GL29443411, GL29451410, GL29505988, GL29527285, GL29812068, GL29820851, GL30104190, GL30115176, GL30152078, GL30161811, GL30100574, GL21476631, GL22779082, GL24782385, GL25352757, GL26494856, GL26512113, GL26847700, GL26871181, GL27474084, GL28473504, GL29313211, GL29332600, GL29458835, GL29464287, GL29668953, GL29686487, GL30072347, GL30086069, GL30195583, GL30338993, GL30348716, GL30548511, GL30551367, GL30565794, GL30613537, GL30629322, GL31459016, GL32424803, GL32468134, GL33026963, GL33169774, GL34169508, GL27138115, GL29796006, GL30295193, GL27447756, GL31952882, GL32317275, GL32317486, GL28234233, GL29355718, GL29451274, GL29547236, GL29750138, GL30150715, GL30551222, GL30590026, GL30739709, GL30752230, GL29386818, GL29468863, GL30792053, GL26635937, GL26646785, GL26744726, GL26764930, GL29178440, GL29548184, GL29589049, GL29747720, GL29797922, GL30551946, GL30565835, GL30685578, GL32432147

వేలం ఎక్కడ ఎలా ఉందో అలాగే, ఏది ఎలా ఉందో అలాగే మరియు ఏది ఉంటే అది ఆధారంగా నిర్వహించబడుతుంది మరియు ఐఐఎఫ్ఎల్ నాణ్యత, స్వచ్ఛత, క్యారెటేజ్, బరువు లేదా వాల్యుయేషన్కు సంబంధించి ఎలాంటి ప్రాతినిధ్యాన్ని లేదా హామీలను ఇవ్వదు. ఐఐఎఫ్ఎల్, దాని స్వంత అభీష్టానుసారం, వేలం జాబితా నుండి ఏదైనా ఖాతాలను వాయిదా వేయవచ్చు లేదా తీసివేయవచ్చు మరియు ముందస్తు నోటీసు లేకుండా మరియు ఎటువంటి కారణాలను కేటాయించకుండా మరియు ఏవైనా లేదా అన్ని బిడ్లు లేదా ఆఫర్లను తిరస్కరించవచ్చు. డిఫాల్ట్ చేసిన రుణగ్రహీతల వివరాలు, తాకట్టు పెట్టిన ఆభరణాలు మరియు ఇతర వివరాలు సంబంధిత శాఖలో ప్రదర్శించబడ్డాయి. డిఫాల్టర్ రుణగ్రహీత(లు) తాజా వడ్డీ మరియు వర్తించే అన్ని ఛార్జీలతో సహా మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి మరియు ఈ నోటీసును ప్రచురించిన తర్వాత కూడా వారి లోన్ ఖాతాను మూసివేయడానికి లేదా క్రమబద్ధీకరించడానికి ఎంపికను కలిగి ఉంటారు, అయితే ఏ సందర్భంలోనైనా, వేలం తేదీ వరకు, విఫలమైతే తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు విక్రయించబడతాయి మరియు మిగులు బకాయిలు (ఏదైనా ఉంటే) వడ్డీ మరియు ఖర్చులతో తిరిగి వసూలు చేయబడుతాయి. అయితే, ఈ పబ్లికేషన్ తర్వాత లేదా తర్వాత మూసివేయబడిన లేదా క్రమబద్ధీకరించబడిన డిఫాల్టర్ లోన్లు అనుపాత పబ్లికేషన్ ఛార్జీని భరించవలసి ఉంటుంది. రుణగ్రహీతలు తమ తాజా బ్యాంక్ ఖాతా వివరాలను సమర్పించి /అప్‌డేట్ చేయడం ద్వారా వేలం ద్వారా వచ్చిన అదనపు సొమ్మును సకాలంలో వాపసు చేయడం సాధ్యమవుతుంది.

**వివరణాత్మక సమాచారం, నిబంధనలు మరియు షరతుల కోసం, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సంబంధిత శాఖ కార్యాలయాన్ని సంప్రదించండి.**

తేదీ: 25.09.2024
వేదిక: కృష్ణ
సదరు/-
అధీకృత సంతకం
ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్

సూర్య
విజయవాడ
బుధవారం
25 సెప్టెంబర్ 2024



# సంపాదకీయం

editpage@suryaa.com

ఐక్యరాజ్యసమితి, 'ప్రపంచ చెవిటి దివ్యాంగ సమాఖ్య' సంయుక్తంగా 1958 నుంచి ప్రతి ఏట 26 సెప్టెంబర్న 'ప్రపంచ వినికిలోప దివ్యాంగుల దినం (ఇంటర్నేషనల్ డెఫ్ డే)' పాటించడం ఆనవాయితీగా మారింది. సెప్టెంబర్ చివరి ఆదివారం రోజున, అనగా 29 సెప్టెంబర్ 2024న అంతర్జాతీయ వినికిడి లోప దినం, సెప్టెంబర్ చివరి వారంలో (సోమవారం నుంచి ఆదివారం వరకు) 2024 సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు 'అంతర్జాతీయ వినికిడ లోప దివ్యాంగుల వారం' కూడా పాటిస్తారు. సెప్టెంబర్ చివరి ఆదివారం, అనగా 29 సెప్టెంబర్ 2024న "ప్రపంచ డెఫ్ డే" నిర్వహించే ఆనవాయితీగా కూడా ఉన్నది. వినికిడి సమస్య కలిగిన ప్రజలను ఏకం చేయడానికి ప్రత్యేక సమాజం, సంస్కృతి, భాష మరియు సైన్ లాంగ్వేజ్ (సైగల భాష) ఉంటాయని తెలుసుకోవాలి. స్థానిక, జాతీయ,

## అల్పాదాయ దేశాల్లోనే 80 శాతం చెవిటితనం !

అంతర్జాతీయ వేదికల్లో చెవిటితనానికి సంబంధించిన సమస్యలు ఉన్న ప్రజలు తమ వైకల్యాన్ని జయించి, సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు. వినికిడి లోపం కలిగిన వారిలో అధికంగా మూగతనం కూడా కనిపిస్తుంది. వైకల్యం లక్ష్యసాధన కు అడ్డురాదని, సామాన్యుల వలె అంగ వైకల్యంతో బాధ పడుతున్న అభాగ్యులు పట్టుదలతో జీవితాలను సుసంపన్నం చేసుకుంటూ, అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. చెవిటి వర్గానికే చెందిన "అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్ దినాన్ని" 23 సెప్టెంబర్న నిర్వహిస్తారు. చెవిటి వారి భాష, భావవ్యక్తీకరణాలకు ప్రత్యేక చిహ్న బాడీ లాంగ్వేజ్ ఉంటుంది. సైన్ లాంగ్వేజీలను ఒక భాషగా ఐరాస గుర్తించింది. సామాన్యులతో పాటు అంగవైకల్యం కలిగిన వారు కూడా కలిస్తే జాతి ప్రయోజనాలు పరిపూర్ణం అవుతాయి. చెవిటితనం జన్యపరంగా లేదా ఇన్ఫెక్షన్లతో కూడా రావచ్చని తెలుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 466 మిలియన్ల చెవిటి దివ్యాంగులు, అందులో 34 మిలియన్ల పిల్లలు ఉన్నారు. పిల్లల్లో 60 శాతం నయం చేయగల చెవిటితనం ఉందని గుర్తించారు. చెవిటి వారిలో 80 శాతం మంది అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన పేద ప్రజలే ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 12-35 ఏండ్ల వయస్సు కలిగిన 1.1 బిలియన్ల ప్రజలు వినికిడి సమస్యకు చేరువలో ఉన్నారని, వీరికి సరైన సమయానికి వైద్యం అందని యెడల చెవిటి వారుగా మిగిలిపోతారని అంచనాకు వచ్చి హెచ్చరిస్తున్నారు. అంగవై కల్యంతో జీవించే వారికి మాత్రమే 300లకు పైగా సైన్ లాంగ్వేజ్లు అందుబాటులో ఉన్నాయి. మానవుడి నేత్రాలు అనేక భావాలను పలికిస్తాయి. మాటలకు అందని మనోహర భాషగా సైన్ లాంగ్వేజ్లు అంగవైకల్యం కలిగిన వారికి వినియోగపడుతున్నాయి. చెవిటి వారి మానవ హక్కుల పరిరక్షణతో పాటు వారికి సమాజం సహానుభూతితో చేయూత ఇవ్వడం, వినికిడి పరికరాలను ఉచిత వితరణ జరగాలనే సదుద్దేశంతో ఈ వేదికలను నిర్వహిం చుకుంటారు. వినికిడి లోపంతో బాధ పడుతున్న వారికి సంఘీభా వాన్ని తెలపడం, వారి హక్కులను పరిరక్షించడం, నిధులను సేకరించడం, పేద చెవిటి వారికి వినికిడి పరికరాలను అందిం చడం, సమాజంలో వివక్షకు దూరంగా సామాన్యులతో సమానం గా చూడడం, అంగవైకల్యం శరీరానికేగాని మనసుకు, సామర్థ్యా నికి కాదనే నమ్మ కాన్ని, విశ్వాసాన్ని కల్పించాలి. డబ్ల్యూహెచ్ఓ అంచనాల ప్రకారం 2050 నాటికి 5 శాతం ప్రజలు, అనగా 700 మిలియన్ల ప్రపంచ ప్రజలు వినికిడి సమస్య లతో బాధ పడతారని, వయోవృద్ధుల్లో 25 శాతం చెవిటితనం ఉండవచ్చని తెలు స్తున్నది. వినికిడి సమస్యలు రాకుండా జాగ్రత్త లు తీసుకుంటూ, బదిరులకు సహాయం చేస్తూ, అంగవైకల్య ప్రజలను జనజీవన స్రవంతిలో కలుపుకొని పోవాలని కోరుకుందాం.

# దేవ దేవుడు వెంకన్ననూ వదలని ప్రబుద్ధులు!

- స్వలాభంకోసం అయిదేళ్లు ఆంధ్రప్రదేశ్ ను చిద్రం చేసారు
- తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠ పూర్తిగా మంటకలిపారు
- భక్తులకు అందాల్సిన పలు సేవల్లో నాణ్యతను దిగజార్చారు
- ఆహారంలో శుచీ శుభ్రతలు లేవని అంటే దాడులు
- వైసీపీ ప్రబుద్ధులు టిటిడిలో చేసిన అక్రమాలు ఎన్నెన్నో
- పక్కావ్యాపార కేంద్రంగా కోనేటి రాయడి దివ్య సన్నిధి



నీరుకొండ ప్రసాద్
9849625610

గత అయిదేళ్లు.కలియుగ వైకుంఠం,తిరుమల,కొండలలో నెలకొన్న ఆ కోనేటి రాయడి దివ్య సన్నిధిని పక్కావ్యాపార కేంద్రంగా,స్వార్ధ రాజకీయాలకు కూడలిగా మార్చింది వైసీపీ ప్రభుత్వం. స్వలాభంకోసం అయిదేళ్లు ఆంధ్రప్రదేశ్ ను చిద్రం చేసిన విధంగానే తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠ ను సైతం పూర్తిగా మంటకలిపారు.అఖిలాండ కోటి బ్రమ్మా%శీ%డ నాయకుడు వెంకటేశ్వర స్వామిని వదల లేదు ప్రభుద్దులు. ప్రజలను పెట్టినట్లే వేంకటేశ్వర స్వామిని ముప్పుతిప్పలు పెట్టారు తిరుమల,తిరుపతి పుణ్యక్షేత్రం కలియుగ వైకుంఠంగా వాసి కెక్కింది. ఏడు కొండలవాడి దర్శనానికి ప్రపంచ నలుమూలలు నుంచి తరలివచ్చి బారులు తీరే అసంఖ్యాక భక్తజన సందోహం దృష్టిలో ఆ దివ్య సన్నిది గోవింద నామాలతో మార్మోగే ఆ ప్రాంగణం పరమ పవిత్రం.మరి అటువంటి కోట్లాది భక్తుల కొంగు బంగారమైన ఆ శ్రీనివాసుడి దివ్య సన్నిదిలో ఇంత ఘోరాతి ఘోరం జరగడం క్షమించరాని నేరం. ఏడుకొండల వాడా వేంకటరమణా గోవిందా గోవిందా అనే భక్తకోటి శరణు ఘోషతో మార్మోగే పుణ్యక్షేత్రంలో జరిగిన ఘోరాతి ఘోరం ప్రపంచ వ్యాప్తంగా వున్న వెంకన్న భక్తులను దిగ్భ్రాంతులను చేసింది.జగన్ రెడ్డి అండ తో టిటిడి పై పెత్తనం చలాయించిన వివాదాస్పద కొందరు వైసిపి నాయకులు,ఉన్నతాధికారుల మూలంగా భక్తులకు అందాల్సిన పలు సేవల్లో నాణ్యతను దిగజార్చారు. శ్రీ వేంకటేశ్వర స్వామి జలప్రసాదంలో, వెంగమాంబ అన్నదాన సత్రంలో అందిస్తున్న ఆహారంలో శుచీ శుభ్రతలు లేవని, ఆరోగ్య ప్రమాణాలను పాటించడం లేదని ఆ మధ్య కేంద్ర హోంశాఖ నిపుణుల బృందం కూడా తేల్చిచెప్పింది. తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యాత్మిక కేంద్రంగా కాకుండా వ్యాపార కేంద్రంగా తయారు అయిందని వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది పీఠాధిపతులు ఆరోపించారు.అయినా వ్యాపార, ఆర్థిక, రాజకీయ,కేసుల అవసరాలను తీర్చుకునేందుకు తిరుమల తిరుపతిని వాడుకుని . ఎన్నో మహా పాతకాలకు పాల్పడ్డారు వైసిపి నాయకులు.శ్రీ వేంకటేశ్వర స్వామి పట్ల తరగని భక్తి ప్రపత్తులతో భక్తులు సమర్పించిన కానుకల సొమ్మును జగన్ వంది మాగదులు విచ్చలవిడిగా ఖర్చుపెట్టారు. వైసిపి ఏలుబడిలో అపవిత్రమైన తిరుమలకు మళ్ళీ పూర్వవైభవం కల్పించేలా తిరుమల తిరుపతిని సంపూర్ణంగా సంస్కరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపట్టారు.ఆయన నేతృత్వంలో తిరుమల తిరుపతి ప్రక్షాళనా యజ్ఞం వేగవంతం అయింది. దేవ దేవుడు వెంకన్నసన్నిధిని టీటీడీ చైర్మన్గా వైవీ సుబ్బారెడ్డి తన జాగీరుగా మార్చుకున్నారు. కొండపై సొంత సామ్రాజ్యం ఏర్పాటు చేసుకుని అడ్డగోలు వ్యవహారాలతో తిరుమల తిరుపతిని భ్రష్టు పట్టించారు.సాక్షాత్తూ దేవదేవుడు తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం, మొత్తం తన సొంత సామ్రాజ్యంగా మార్చారు. వెంకన్న భక్తిలో తరించాల్సిన ఆయన వీవీఐపీల సేవలో తరించారు . వీవీఐపీ దర్శనాలు టీటీడీ నిబంధనల ప్రకారం చైర్మన్ కోటా కింద రోజుకు సగటున ఆరు నుంచి 12 మందికి మాత్రమే వీవీఐపీ దర్శనం కల్పించాలి. ఒక్కో సిఫారసు లేఖపై ఆరుగురిని ఈ దర్శనాలకు అనుమతిస్తారు.కానీ వైవీ సుబ్బారెడ్డి జమానాలో మాత్రం రోజుకు సగటున 60 సిఫారసు లేఖలు ఇచ్చి 364 మందికి వీవీఐపీ దర్శనాలకు వీలు కల్పించారు. చైర్మన్గా నాలుగేళ్ల కాలంలో 3,60,338 మందికి దగ్గరుండి దర్శనాలు చేయించారు. తర్వాత భూమన కరుణాకర్రెడ్డి చైర్మన్గా ఉన్న 9 నెలల కాలంలోనే ఏకంగా 43 వేల మందికి ప్రత్యేక దర్శనాలు కల్పించారు. అంటే సగటున రోజుకు 172 మందికి దర్శనాలు చేయించారు. దర్శనాల పేరిట వ్యాపారం చేశారు అన్న అనుమానం కలుగుతున్నది. తిరుమల పవిత్రను కాసుల వేటకు వేదికగా మార్చుకున్నారు. మందీ మార్బలాన్ని వెంటేసుకుని ఎప్పుడు బడితే అప్పుడు దర్శనానికి వెళ్తూ సామాన్య భక్తులకేమో నరకంచూపించారు.. టిటిడి కి పెద్దదిక్కు అయిన కీలక పోస్టులలో గతంలో సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించేవారు.కానీ ఆ సంప్రదాయాన్ని కాలదన్నిన జగన్ ప్రభుత్వం తమకు కావాల్సిన అధికారిని డిల్లీ నుంచి డెప్యుటేషన్ మీద తీసుకొచ్చి మరీ టిటిడిపై సర్వాధికారాలు కట్టబెట్టింది. వెంకన్న స్వామి సేవకు కాదు. వైసిపి కి సేవకుడిగా పనిచేసిన ఆయన తన యజమాని చీకటి వ్యవహారాలెన్నింటినో చక్కబెట్టారు. టిటిడి పాలకమండలిలో నేరచరితులకు పెద్దపీట వేసి జగన్ రెడ్డి శ్రీవారి భక్తుల మనోభావాలను గాయపరిచారు. నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా వార్షిక బడ్జెట్ కలిగిన టిటిడిలో వైసీపీ ప్రబుద్ధులు చేయని అక్రమాలు లేవు. చక్కగా ఉన్న కట్టడాలను కూలగొట్టి, పునర్నిర్మాణాలకు టెండర్లు పిలిచి కమిషన్లు కొల్ల గొట్టడం కొరకు కొత్తగా పునర్నిర్మాణాలు చేపట్టారు. గడచిన అయిదేళ్లలో స్వామివారి లడ్డూ ధరల నుంచి కొండ మీది గదుల అద్దె వరకు అన్నింటినీ విపరీతంగా పెంచి సామాన్య భక్తులను నిలువుదోపిడీ చేశారు. జగన్ జమానాలో ఊరూరికీ పాకిన గంజాయి మహమ్మారి ఆఖరికి తిరుమలకూ పాకింది.అయిదేళ్ళకాలంలో అటువంటి ఉదంతాలుఎన్నో వెలుగుచూశాయి. శ్రీనివాసుడి సన్నిధిలో పాపిష్టి పనులకు తెగబడిన వారందరూ తగిన దండనకు అర్హులని భక్త జనం గళమెత్తుతోంది! తిరుమల పవిత్రతను ఉద్దేశపూర్వకంగానే అపవిత్రం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుమల పాలనను అస్తవ్యస్తం చేసేశారు. అత్యంత వివాదాస్పదులుగా ముద్రపడిన తన బంధువులకు, అధికారులకు టీటీడీ పగ్గాలు అప్పగించి, వారి ఇష్టారాజ్యానికి కలియుగ దైవాన్నీ, భక్తులను వదిలేశారు. నాణ్యతకు, పవిత్రతకు తూట్లు పొడిచారు.డెయిరీల నుంచి నెయ్యి సేకరణను ఆపివేసి ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన లడ్డూ పవిత్రతను మంటగలిపారు.వైసీపీ ప్రభుత్వం 2020లో నెయ్యి ప్రొక్యూర్మెంట్ విధానంలో మార్పులు తీసుకువచ్చింది. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ అప్పటివరకు తిరుమల ఆలయం అవసరాల కోసం సరఫరా చేస్తున్న నందినీ బ్రాండ్ నెయ్యిని నిలిపివేసింది. దీంతో తిరుమల పవిత్రత అనేది పూర్తిగా సంక్షోభంలో పడిపోయింది. రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా గత జగన్ ప్రభుత్వం నాడు ఎంపిక చేసిన ఐదు కంపెనీల్లో ఒకటి సరఫరా చేసిన నెయ్యిలోనే పంది, ఎద్దు కొవ్వు, చేప నూనెలు, వెజిటబుల్ ఆయిల్ ఉన్నట్టు బయటపడటం చూసి దేశమంతా దిగ్భ్రా%శీ%తి గురి అయింది.రూ.800 దాకా పెడితేగానీ మార్కెట్లో లీటర్ గేదె నెయ్యి దొరకడం లేదు. అలాంటిది 320 నుంచి 411 రూపాయలకే కిలో ఆవు నెయ్యిని ఎలా అమ్ముతారు.అంత తక్కువ రేటుకు స్వచ్ఛమైన నెయ్యి దొరకడం అసాధ్యం. జగన్ ముఠా మాత్రం అబ్బే ఆ రేటుకే మాంచి ఘుమ ఘుమలాడే నెయ్యి వచ్చిందంటూ అబద్దాలకు తెగబడుతున్నారు.అశేష భక్తజనానికి తిరుమల అతి పవిత్రమైనది.108 దివ్యదేశాల్లో ఒకటిగా,కలియుగ వైకుంఠంగా వాసికెక్కిన పుణ్యక్షేత్రమది. ఆపద మొక్కులవాడా. ఆనాథ రక్షకా అంటూ పిల్లాపాపలతో తిరుమల కొండకొచ్చి తలనీలాలు సమర్పించి దేవ దేవుడిని దర్శనం చేసుకుంటారు భక్తులు. కళ్ల కద్దుకుని లడ్డూ ప్రసాదం తీసుకు వెళ్లి ఇంట్లో దేవుడి ముందు ఉంచి పూజలు చేసి దండం పెట్టుకుని, అయిన వారికి,స్నేహితులకు పంచిపెట్టి తామూ ప్రసాదం స్వీకరిస్తారు. అలాంటి మహాప్రసాదం తయారు నెయ్యిలో పంది కొవ్వు ఇతర కలుషితాలు ఉన్నాయని తేలడంతో ఇదెక్కడ ఘోరమంటూ నినదిస్తున్న భక్తుల నిరసనల్లో- జగన్మోహన్ రెడ్డి వికృత ఏలుబడిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ ఛీ కొడుతున్నారు భక్తులు . దైవ నిలయాన తయారు అయ్యే మహా ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా,అప్రమత్తంగా చిత్తశుద్ధితో తయారు చేసి భక్తులకు అందజేయడంలో అత్యంత బాధ్యత వహించాలి. స్వచ్ఛత,పవిత్రత,విశిష్టత ప్రసాదం సహజ గుణాలు. ఏ ప్రసాదమైన దేవుడి అనుగ్రహ ఫలితమే. తిరుమల శ్రీ వారి సన్నిధిలో ఘనమైన లడ్డు,వడ ప్రసాదాలు భక్తులకు అత్యంత విశిష్టమైనవి. తిరుమల మహాప్రసాదాన్ని మించి మరేదీలేదని,ఉండదు అంటోంది దైవ పురాణం.అటువంటి మహా ప్రసాదాన్ని అపవిత్రం చేశారు అసుర పాలకులు. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి తిరుమల చేరుకునే భక్తులకు ఒక రోజుకు ఒక గదికి రూ.150 ఉన్న అద్దెను రూ.1,700 లకు- రూ.200 ఉన్న పెద్ద గది అద్దె ను రూ.2200. లకు లాభార్జనే లక్ష్యంగా గదుల అద్దెలు పెంచి సామాన్య భక్తుల నడ్డి విరిచారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు లాభాపేక్ష లేకుండా సౌకర్యాలు కల్పించాల్సిన టీటీడీ గదుల అద్దెలు పెంచడంపై భక్తులు తీవ్ర ఆవేదన చెందారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం టీటీడీ పాలకవర్గం భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడంపై కాకుండా, వారి నుంచి డబ్బు పిండటంపైనే ఎక్కువ దృష్టి పెట్టింది. గదుల అద్దెలు పెంచడం, భక్తులకు ఉచితంగా ఇచ్చే లడ్డూల సంఖ్యను కుదించడం, ప్రసాదం ధరల పెంపు లాంటి చర్యలకు పాల్పడ్డారు. ఆర్జిత సేవా టికెట్ల ధరలు ఎంత పెంచినా సామాన్యులకు ఇబ్బంది లేదు. కొండపై గదుల అద్దెలను ఒక్కసారిగా దరల్ని 1133% పెంచడం సమర్ధ నీయమా?టీటీడీ అంటే పరమ పవిత్రతకు మారుపేరు. అలాంటి పవిత్ర సంస్థ టీటీడీ చైర్మన్ గా నాస్తికుడు, క్రైస్తవ సంప్రదాయ ప్రకారం తన కుమార్తె పెళ్లి చేసిన కరుణాకర్ రెడ్డిని టీటీడీ చైర్మన్ గా నియమించారు. రాజకీయాల కోసమైతే పార్టీ పదవులు ఇవ్వాలి కానీ క్రైస్తవ మతానికి అనుకూలంగా ఉన్న వ్యక్తికి అత్యున్నత దార్మిక సంస్థ చైర్మన్ పదవి ఇచ్చి టీటీడీ ని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు.ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టయి, అప్రూవర్ గా మారిన అరబిందో గ్రూప్ డైరెక్టర్ పెనక శరత్ చంద్రారెడ్డికి. మంత్రి పదవులు, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వలేని వారికి అవినీతి ఆరోపణలు,సీబీఐ కేసుల్లో నిందితులను సభ్యులుగా నియమించి శ్రీ వారి ఆలయ ప్రతిష్టను మసక బార్చారు.రాజకీయ పునరావాసం కల్పిస్తూ.అయోగ్యులను,నేరచరితులను,ధర్మ కర్తల మండలిలో కూర్చోబెట్టడం దేవుడి పై పెత్తనం చెయ్యడమే. పవిత్ర సంస్థ పాలక మండలిలో నేరస్తులను సభ్యులుగా చోటు కల్పించారు.తితిదే చైర్మన్,ఈవో సహ తిరుమల-తిరుపతిల్లోని కీలక పదవులను ఒక ప్రధాన సామాజికవర్గానికి ప్రభుత్వం కట్టబెట్టింది. శ్రీవారిని దర్శించుకునేందుకు ముందుగా డిక్లరేషన్ ఫారంపై సంతకం చేసే సంప్రదాయం బ్రిటీష్ కాలం నుంచే అమల్లో ఉంది.ఇతర మతాలకు చెందిన వ్యక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తే డిక్లరేషన్ ఇచ్చేవారు.టీటీడీ ఆలయాల్లోకి అన్యమతస్థులు ప్రవేశించే ముందు డిక్లరేషన్ ఇవ్వాలని 1900 ఏప్రిల్ 11న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ అంశాన్ని చాప్టర్ 18లో పొందుపర్చారు . టీటీడీ ఆలయాలు, హిందూ దేవాలయాలను హిందువులు తమ హక్కుగా భావిస్తుంటారు. ఇతర మతస్థులు టీటీడీ ఆలయాల్లోని దేవతలను దర్శించుకునేందుకు ఎటువంటి అభ్యంతరంలేదు. ఇందుకోసం డిక్లరేషన్ సమర్పించాలని నోటిఫికేషన్ లో స్పష్టంగావుంది. స్వామి దర్శనానికి వెళ్లే అన్యమతస్థులు తమ పేరు, మతాన్ని పేర్కొంటూ శ్రీవేంకటేశ్వరస్వామిపై తనకు నమ్మకం, గౌరవం ఉందని అందువల్ల దర్శనానికి అనుమతించాల్సిందిగా పేర్కొంటూ డిక్లరేషన్ పై సంతకం చేయాల్సి ఉంది. దానికి ఆమోదం లభించాక ఇతర భక్తుల తరహాలోనే స్వామిని దర్శించుకోవచ్చు. అప్పటి రాష్ట్రపతిగా ఉన్న అబ్దుల్ కలాం తిరుమల సందర్శన సందర్భంగా డిక్లరేషన్ పై సంతకం చేశారు. హిందు సాంప్రదాయం ప్రకారం క్రిష్టియన్ అయిన జగన్ తిరుమలకు వెళ్లి కనీసం రిజిస్టర్ లో సంతకం చెయ్యకుండా హిందుమత సిద్దాంతానికి విరుద్దంగా వ్యవహరించారు అన్య మతస్థులు శ్రీవారిని దర్శించుకునేందుకు ఎటువంటి డిక్లరేషన్ ఇవ్వాల్సిన అవసరం లేదని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వాదించారు.ఏది ఏమైనా కోట్ల మంది హిందువులు మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలపడం నీచ,నికృష్ట మైన చర్య. దోషులకు శిక్ష పడాల్సిందే. జగన్ ప్రభుత్వ హయాంలో టీటీడీలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, అపచారాలపై విచారణ జరగాలి. దోషులను కఠినంగా శిక్షించాలి.

# "ఒకే దేశం-ఒకే ఎన్నిక" నినాదం బాగుందే !

- అధ్యక్ష తరహా ప్రభుత్వం వైపు అడుగులే జమిలి ఎన్నికలు
- ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతవరకు సమంజసం?
- దేశ సామాజిక,సాంస్కృతిక, రాజకీయ,భౌగోళిక పరిస్థితులకు సరిపడదు
- రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు నామమాత్రంగా మారే చాన్స్
- భవిష్యత్తులో కేంద్రంపై ఆధారపడే అనుబంధ సంస్థలుగా మారే అవకాశం



నేదునూరి కనకయ్య
9440245771

"ఒకే దేశం-ఒకే ఎన్నిక" అనడానికి,వినడానికి చాలా బాగున్న నినాదం.కొన్ని రోజుల క్రితం కేంద్ర కేబినెట్ జమిలి ఎన్నికలకు ఆమోదం తెలుపడంతో ఈ నినాదం దేశ వ్యాప్తంగా బాగా చర్చనీయాంశం అవుతుంది.ఈ విధానం పాతదే అయినప్పటికి ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతవరకు సమంజసం? ఈ దేశంలో అతి ప్రాచీన కాలం నుంచీ భిన్నత్వంలో ఏకత్వం పరిడవిల్లుతుంది.భిన్నమైన సింధు ఆర్యన్ సాంస్కృతిక లక్షణాలు అతి ప్రాచీన కాలం నుంచీ నేటి వరకు రైలు పట్టాల వలె సమాంతరంగా కొనసాగుతూనే ఉన్నాయి.బౌద్ధ,జైన మతాల సంప్రదాయాలు హిందూ మత సంప్రదాయాలతో పాటే మనుగడ సాగిస్తున్నాయి.అరబ్బులు,తురుష్కులు మొదలైన వారి ఆచార వ్యవహారాలు ఈ సమాజంలో సహజీవనం చేస్తూనే ఉన్నాయి. తర్వాతి కాలంలో క్రైస్తవ ఆచారాలు ఈ దేశంలో ప్రవేశించి కొనసాగుతూనే ఉన్నాయి.ఇవన్నీ ప్రస్తుతం కలసి మెలసి భిన్నత్వంలో ఏకత్వం వలె సహజీవనం చేస్తున్నాయి.ఈ దేశంలో భిన్న సంస్కృతులు ఏకత్వంతో కలిసి మనుగడ సాగిస్తున్నాయి. కానీ గత పది సంవత్సరాలుగా దేశంలో ఏకీకరణ ప్రయత్నాలు ఊపందుకున్నాయి.ఒకే దేశం-ఒకే భాష.ఒకే దేశం - ఒకే పన్ను.ఒకే ఉద్యోగం-ఒకే పింఛన్.ఒకే దేశం-ఒకే ఎన్నికలు. ఇలా ఒకే దేశం ఒకే విధానం అనేది ఒక నినాదంగా మారిపోయింది.కొన్ని సందర్భాల్లో ఈ నినాదం బాగుండొచ్చు.స్థూలంగా చూస్తే అన్ని సందర్భాల్లో ఒకే దేశం-ఒకే విధానం ఈ దేశ సామాజిక,సాంస్కృతిక, రాజకీయ,భౌగోళిక పరిస్థితులకు సరిపడానిది.. మన రాజ్యాంగం మొదటి ప్రకరణ మన దేశాన్ని రాష్ట్రాల యూనియన్ అని పేర్కొంది.అంటే భిన్న సంస్కృతులు గల ప్రాంతాలు (రాష్ట్రాలు)తమ తమ సంస్కృతులను కాపాడుకుంటూనే ఒకే దేశంగా మనుగడ సాగించడం.ఒకేదేశం-ఒకేఎన్నికలు ఈ మనుగడను భంగ పరచవచ్చు. ఈ విధానం వల్ల భవిష్యత్తులో రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు నామమాత్రంగా మారి రాష్ట్రాలు కేవలం పరిపాలన యూనిట్లుగా మారే అవకాశం ఉంది.తమ తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ తమ ప్రత్యేకతను చాటుకుంటూ మనుగడ సాగిస్తున్న రాష్ట్రాలు భవిష్యత్తులో కేంద్రంపై ఆధారపడే అనుబంధ సంస్థలుగా మారే అవకాశం ఉంది. ఈ దేశ ఎన్నికల విధానాన్ని మార్చడం ద్వారా ప్రస్తుత ప్రభుత్వ స్వరూపాన్ని మార్చే ప్రణాళిక దాగి ఉంది.భిన్న అభిప్రాయాలకు నిలయమైన పార్లమెంట్ విధానం నుంచి కేంద్రీకృత అధికారాలకు అవకాశం ఇచ్చే అధ్యక్షతరహ విధానానికి అడుగులు పడవచ్చు. ప్రస్తుతం వేరు వేరుగా జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు చక్కని తీర్పులే ఇస్తున్నారు. రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలకు, పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ పార్టీలకు ఓట్లు వేస్తున్నారు.ఎవరు ఏ పని చేయాలో సుస్పష్టంగా తెలియజేస్తున్నారు.అయినా కేంద్రం డబులింజన్ సర్కారుపై వ్యామోహంతో ఒకే దేశం-ఒకే ఎన్నికల నినాదం ముందుకు తెస్తుంది. రాష్ట్రాల ఎన్నికల సందర్భంగానైనా కేంద్రం ఆయా రాష్ట్రాలపై ప్రేమను కనబరుస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి వరాల జల్లులు కురిపిస్తుంటుంది.ఒకే దేశం-ఒకే ఎన్నికల జరిగితే రాష్ట్రాలపై సవతి తల్లి ప్రేమను సైతం కనబరిచే అవకాశం ఉండకపోవచ్చు. వేరువేరు ఎన్నికల సందర్భంలో ఆయా రాష్ట్రాల అవసరాలు,స్థానిక సమస్యలు చర్చకు వస్తాయి.ఒకే దేశం-ఒకే ఎన్నికలు జరిగితే జాతీయ అంశాలు స్థానిక అంశాలను కనుమరుగు చేస్తాయి. స్థానిక సంస్థల ఎన్నికలు రెండవ దశలో 100 రోజుల్లో పూర్తి చేయడం అంటే పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన పార్టీలు గంపగుత్తగా స్థానిక సంస్థలను హస్తగతం చేసుకోవడంగానే భావించాల్సి వస్తుంది.స్థానిక ఎన్నికల్లో ప్రజా నిర్ణయం స్పష్టంగా వ్యక్తపరిచే అవకాశం ఉండదు. ఒకే దేశం-ఒకే ఎన్నికల సందర్భంగా పౌరులు జాతీయ,స్థానిక సమస్యలను వేరువేరుగా విశ్లేషించుకొని వేరు వేరుగా ఓటింగ్ మిషన్ల లో ఓటు వేసే (క్రాస్ ఓటింగ్) విచక్షణ ఇంకా అలవర్చు కోలేదు. అంబేద్కర్ గారు అన్నట్లు పరిస్థితులను బట్టి ఏక కేంద్రగా,సమాఖ్యగా మారే స్వభావం ఉన్న రాజ్యాంగం భవిష్యత్తులో పూర్తిగా ఏక కేంద్రంగా, కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కేంద్రీకృత ప్రభుత్వంగా మారి పోవచ్చు. ప్రస్తుతం ప్రాంతీయ పార్టీలు బలంగా ఉండి,ఆయా ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నపుడే కనీసం రాజ్యసభలోనైన ప్రాంతీయ అవసరాలపై బలమైన వాణి వినిపిస్తాయి.జమిలి ఎన్నికలు రాష్ట్రాలకు ఆ అవకాశం లేకుండా చేస్తాయి.రాష్ట్రాలు బలంగా ఉంటేనే పార్లమెంట్లో చట్టాలు చేస్తున్న సందర్భంలో లోక్ సభలో,రాజ్యసభలో బలమైన వాదనలు వినిపిస్తాయి. ఒకే దేశం ఒకే ఎన్నికల వల్ల కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. రాష్ట్రాలు బలంగా లేనప్పుడు కేంద్ర రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపకం లో రాష్ట్రాలకు అన్యాయం జరిగితే ప్రశ్నించలేవు. అంతర్ రాష్ట్ర నదీ జలాల విషయంలో కూడా సరైన పంపకాలు జరగవు.అంతర్ రాష్ట్ర మండలి,ఈశాన్య రాష్ట్రాల మండలి,జోనల్ కౌన్సిల్స్ నామ మాత్రంగా మారి రాష్ట్రాలు ప్రేక్షకపాత్ర కే పరిమితమౌతావి.రాష్ట్రాల్లో కేంద్ర భద్రత దళాల జ్యోకం,అఖిల భారత సర్వీసులు పాత్ర పెరగవచ్చు. ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఒకే ఎన్నికలు సాధ్యం కాకపోవచ్చు. ఓటింగ్ మిషన్స్,భద్రత సిబ్బంది,ఎన్నికల సిబ్బంది తదితర వాటినీ సమకూర్చడం భారత ఎన్నికల కమిషన్ కు శక్తికి మించిన భారం కావచ్చు. ఎన్నికల అనంతరం పార్టీలు మెజార్టీ సాధించనప్పుడు,మధ్యలో ప్రభుత్వాలు కూలిపోయినప్పుడు, ఏర్పడే ప్రభుత్వాల గురించి ఉన్నత స్థాయి కమిటీ సిఫారసులు చేసినప్పటికీ అవి చరణలో సాధ్యం కాకపోవచ్చు.జమిలీ ఎనికలకై ప్రస్తుతం మనుగడలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల పదవి కాలం విషయాల్లో నిర్ణయం తీసుకోవడం కత్తి మీద స్వామే అవుతుంది.ఒకే దేశం-ఒకే ఎన్నిక నిర్వహణకై 18 రాజ్యాంగ సవరణలో కొన్నిటికి 2/3 వంతు మెజార్టీ అవసరం,సగం రాష్ట్రాల అంగీకారం అవసరం.సొంత మెజార్టీ లేని ప్రస్తుత పరిస్థితుల్లో పార్లమెంటు లో చట్టం చేయడం సాధ్యం కాకపోవచ్చు.కేంద్రం తేనున్న జమిలీ ఎన్నికలకు ప్రాంతీయ పార్టీలు జైకొట్టి కూర్చున్న కొమ్మనే నర్కొకపోవచ్చు.ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేస్తుందని ఆయా రాష్ట్రాలు కేంద్రంపై గుర్రుగా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశానికి కేజ్రివాల్ పేర్కొన్నట్లు ఒకే దేశం - ఒకే విద్య,ఒకే దేశం - ఒకే వైద్యం కావాలి,కానీ భిన్నత్వంలో ఏకత్వంతో పరిఢవిల్లుతున్న ప్రజాస్వామ్యాన్ని మసకపరచడం కాదు. స్వాతంత్రం వచ్చిన కొత్తలో పరిస్థితులు వేరు,నేటి పరిస్థితులు వేరు.ప్రస్తుత పరిస్థితుల్లో ఈ విధానం భారత రాజ్యాంగ మౌలిక స్వరూపానికి,సమైక్య స్ఫూర్తికి విరుద్ధం.జమిలి ఎన్నికలు ముమ్మాటికీ అధ్యక్ష తరహా ప్రభుత్వం వైపుకు అడుగులుగానే భావించాల్సి వస్తుంది.

## పేదల ఆకలి పట్టని రేషన్ డిపోలు

ఆంధ్రప్రదేశ్ లో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన పేదలకు ఉచిత బియ్యంతో పాటు రాయితీపై కందిపప్పు, పంచదారను కూడా సరఫరా చేయాల్సి ఉండగా గత నాలుగైదు నెలలుగా కార్డుదారులకు కేవలం ఒక్క బియ్యం మాత్రమే సరఫరా చేస్తూ కొన్ని ప్రాంతాల్లో అరకొరగా పంచదార ఇస్తున్నారు . రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యం లో రేషన్ డిపో లు , గోదాముల్లో తనిఖీలు చేపట్టినప్పుడు పేదలకు ఇచ్చే పంచదార, అంగన్వాడీలకు ఇచ్చే కందిపప్పు, నూనె ప్యాకెట్లు బరువు తక్కువగా ఉన్నట్లు గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు, పంచదార, నూనె ఇతర ప్యాకెట్ల పంపిణీ నిలిపేయాలని మంత్రి అధికారుల్ని ఆదేశించారు. ఇదే సాకుగా చూపుతూ జ్యుడీషియల్ ప్రివ్యూ నుంచి అనుమతులు లభించిన తర్వాత కూడా కందిపప్పు టెండర్ల ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లకుండా పౌర సరఫరాల శాఖ నిలిపివేసింది. చక్కెర సరఫరాదారులు ఎక్కువ ధరలు కోట్ చేశారనే కారణంతో అధికారులు ఆ టెండరును కూడా రద్దు చేసేశారు. దీంతో గత మూడు నెలలుగా రాష్ట్రం మొత్తంగా పంచదార పంపిణీని కూడా నిలిపివేశారు. అనూహ్యంగా పెరుగుతున్న ధరలలో భాగంగా బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.200 దాటిపోగా... పంచదార కిలో దాదాపు రూ.50కు పైమాటే చేరువైంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వస్తు దిగుమతులపై పన్నుల శాతాన్ని పెంచిన దరిమిలా వంటనూనెలు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి . ఇవి చాలవన్నట్టు రాష్ట్రములో అనావృష్టి కారణముగా సంభవించిన భారీ వర్షాలు , వరదలు వలన నిత్యావసరాలు , ఉల్లి తదితర కూరగాయలు ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు అనుభవిస్తున్నారు.రాష్ట్రములో ఈ సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల నిబంధనలు, అలాగే కొత్త ప్రభుత్వం విధాన నిర్ణయాల్లో జాప్యం కారణంగా గత 6 నెలలుగా కొత్త రేషన్ కార్డులు మంజూరు కాకపోవడం వలన అర్హులైన కొంతమంది పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం వారు సత్వరం స్పందించి పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల నిత్యావసరాలను పూర్తి స్థాయిలో రేషన్ డిపో ల ద్వారా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి. అలాగే పెరుగుతున్న ధరలు దృష్ట్యా పామాయిల్ , సన్ ఫ్లవర్ వంట నూనెలను సబ్సిడీ ధరలలో కార్డుదారులకు అందించాలి.

అప్పన్న గొనప 9440733620

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com
SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

## కేటీఆర్ - సీఎం రేవంత్ నడుమ మాటల యుద్ధం

తెలంగాణాలో ఎన్నికలు జరిగి అధికారం మార్పు జరిగి పది నెలలు అవుతోంది. బారసా ప్రభుత్వం ఒడి కాంగ్రెస్ నెగ్గింది. అది మొదలు రెండు పార్టీల మధ్య తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తిగత దూషణలు ఆగడంలేదు. సిఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ కి మధ్య గత కొన్ని నెలలుగా పచ్చ గడ్డి వేస్తే భగ్గు మంటుంది. కాళేశ్వరం నుండీ మొదలు మొన్న విగ్రహాల వరకు వారి మధ్య వార్ నడుస్తుంది. కాళేశ్వరం పై తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డ రేవంత్ రెడ్డికి అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు కేటీఆర్. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై కుడా నువంటే నువ్వని తీవ్ర స్థాయిలో వాదులాట వాక్ యుద్దాలు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి నీ సహించని బరసా ఏదో ఒక విధంగా విమర్శలకు దిగుతున్నారు. ప్రతీ విషయాన్ని రాజకీయంగా చూస్తున్నారు. కొన్ని సార్లు ఇద్దరు ఆవేశం లో నోరు జారుతున్నారు . అసెంబ్లి లో కుడా మహిళలను అవమానించారు . ఉచిత బస్ పతకం పై కేటిఆర్ మహిళలను ఉద్దేశించి కించ పరిచే విధంగా మాట్లాడారు. దానికి మహిళా మణులు ఉద్యమించారు. మహిళా కమిషన్ సిరియస్ గా తీసుకుంది. తరువాత కేటీఆర్ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పడం తో కథ సుఖాంతం ఆయింది. తరువాత భారసా ఎమ్మెల్యేల జంపింగు పై రచ్చ మొదలు పెట్టారు. మీరు చెసింది తప్పు అంటే మిది తప్పు అని కేటీఆర్ రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పీకుతావా . సన్నాసి దద్దమ్మ , వివు చిరుతా . చింత బరిక తొ బడుతా . ముక్కు నేలకు రాయిస్తా . నీ అయ్య . అంటూ ఇద్దరు తగ్గేదే లే. అనే విధంగా రెచ్చిపోయారు . ఇక రైతు రుణ మాఫీ విషయంలో కూడా మాటల తూటాలు పేలాయి. మేం ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణ మాఫీ చేసామని రేవంత్ రెడ్డి వాదిస్తే. చత్ అంతా అబద్ధం. ఎక్కడ పూర్తి చేశారు. ఏదో కొంత మంది కి మాత్రమే అందించి గొప్పలు చెప్పుకుంటున్నారు. అని కేటిఆర్ తన దైన శైలిలో విరుచుకు పడ్డారు. ఇక అసలు విషయం అసెంబ్లి లొ విగ్రహాల ఆవిష్కరణ. ప్రధాన గేటు వద్ద తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించాలని భావించారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్. ఆయన కోరిక తీరకుండానే అధికారం నుండి దిగిపోవడం జరిగింది. ఇక పగ్గాలు చేపట్టిన రేవంత్ రెడ్డి తన పార్టీ పై కాంగ్రెస్ పై తనకున్న భక్తిని చాటుకున్నారు. అందులో భాగంగా తెలంగాణా అసెంబ్లీ లో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. దినికి పెద్ద ఎత్తున మాటల యుద్దాలు చేసుకున్నారు. అక్కడ తెలంగాణా తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించాలని పట్టు పట్టారు కేటిఆర్. ఇది ముమ్మాటికీ తెలంగాణా ను అవమానించడం అని ధ్వజమెత్తారు. పెడితే మళ్ళీ మేము అధికరలోకి వచ్చాక రాజీవ్ గాంధీ విగ్రహాన్ని మర్యాదగా తొలగిస్తామని ప్రకటించారు. దానికి స్పందన గా రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దమ్ముంటే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తచ్ చేసి చూడమని కేటిఆర్ కి సవాల్ చేశారు. అలా ఇద్దరు ఆవేశం లో వ్యక్తిగతంగా కూడా తిట్టుకునే స్థాయికి వెళ్ళారు. మొత్తానికి రేవత్ రెడ్డీ తన మాట ప్రకారం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తమ నాయకురాలు సోనియా గాంధీ గారి అభిమానాన్ని చూరగొన్నారు. కానీ ఇక్కడ రేవంత్ రెడ్డి తెలంగాణా తల్లి విగ్రహాన్ని విస్మరించలేదు. దాన్ని అసెంబ్లి లోపల పెడతామని తెలిపారు. ఇంకా శాంతించని కేటిఆర్ రేవంత్ రెడ్డికి అంత ఉత్సాహం ఉంటే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తన ఇంట్లో నో లేక పార్టీ ఆఫీసులో నో పెట్టుకోమని సలహా ఇచ్చారు. పదేళ్లు అధికారం లో ఉన్న మీరు తెలంగాణా తల్లి విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదు.? అప్పుడు లేని తెలంగాణా తల్లి పై ఆసక్తి ఇప్పుడు ఎలా వచ్చింది. అంటూ తీవ్రంగా విరుచుకు పడ్డారు రేవంత్ రెడ్డి. ఇలా ప్రతీ చిన్న విషయానికి ఇద్దరి మధ్య అనవసర రాద్ధాంతం జరుగుతూనే ఉంది. ఇది ఎంతో శోచనీయం. తెలంగాణా ప్రజాలు అన్ని గమనిస్తున్నారు. అనే స్పృహ ను ఇద్దరు నేతలు కలిగి ఉండాలి. విషయం ప్రజలకు అవసరమైన ది అయితే దాని మీద ఎంత గట్టిగా ఘాటుగా మాట్లాడాలి. అవసరం అయితే నిలదియాలి. ఇది ప్రతిపక్ష నేత గా కేటిఆర్ కి ఉన్న హక్కు. ప్రభుత్వ విధానాలలో లోపాలని కూడా ఎత్తి చూపాలి. కానీ విమర్శించడమే పని గా భావించకూడదు. చిటికి మాటికి నోరు పారేసుకోవడం ఇరువురు నేతలకు తగదు గాక తగదు. రేవంత్ రెడ్డి మాటల్లో భాషలో దూషణలు వ్యక్తిగత దూషణలు లాంటివి ఉంటాయి. గతంలో బారస అధినేత మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ కుడా కాస్త తీవ్ర స్థాయిలో విరుచుకు పడేవారు . ఇష్టానుసారంగా దూషణ బూతులు సర్వ సాధారణం నేటి నేతల మాటల్లో నిత్యం వినిపిస్తున్నాయి. ఒకనాటి నేతలు ఎంతో గొప్ప పేరున్న వక్తలు గా ప్రసిద్ధి చెందారు.కానీ నేడు మాటలు తూటాలు గా బూతులుగా మారాయి. ఇవే తెలంగాణా యొక్క ఇమేజ్. అనే చెందంగా మారాయి. దగ్గరలో ఏ ఎన్నికలు కూడా లేవు. అయినా వీరి మధ్య వార్ నాన్ స్టాప్ గా నడుస్తుంది. దీనికి త్వరలోనే ముగింపు రావాలి అని మనసారా తెలంగాణ ప్రజల ఆకాంక్ష.

శ్రిష్టి శేషగిరి - 9290652632

## లడ్డులు బాగలేకపోతే ఉపముఖ్యమంత్రి దీక్ష ఎమిటి ?

తిరపతి లడ్డులసంగతి టీటీడి వారు చూసుకుంటారు. ఎదైనా లోపంజరిగితే సరిచెయ్యటానికి ఒక ఐఏఎస్ అదికారి ఉంటాడు. కొంతమంది బోర్డుసభ్యులు ఉంటరు క్రమశిక్షణ చర్యలు ఉంటాయిమనది లౌకికరాజ్యం మతానికి గాని , దేవునికిగాని అపచారం జరిగితె మతం చూసుకుంటది . మతసంస్థలు చూసుకుంటాయి ప్రభుత్వం అజమాయిషీమాత్రమే చెయ్యాలి అంతేకాని లౌకిక రాజ్యంలో ఒక ముఖ్యమంత్రి ఇలా దీక్షాలు పూనటం సరికాదు ఒక మంత్రిగా తప్పుజరిగినచోట , బ్యాద్యులకు శిక్ష వెయ్యండి. లౌకికరాజ్యంలొ మతం వ్యక్తిగతంగానే ఉంచుకోవాలి ప్రభుత్వం ఏమతానికి అనుకూలంగాను , వ్యతిరేకంగాను పనిచెయ్యకూడదు.

లౌకిక వాదం అంటే మతరహితం పాలనలో ఎక్కడా మతజోక్యం ఉండకూడదు అందుకె మొదటిప్రధాని జవహార్ లాల్ నెహ్రు సెక్యులరిజానికి ప్రాముఖ్యత ఇచ్చాడు పాలకులు అలానే ఉండాలి భిన్న మతాలు , భిన్నసంస్కృతులు , భిన్న ఆచారాలు కలిగిన మనదేశానికి లౌకికవాదమే శరణ్యం అయితే సర్వేపల్లి రాధాకృష్ణన్ సెక్యులరిజానికి ఒక తప్పుడు అర్దాన్ని ప్రతిపాదించాడు.

మతరహితానికి బదులు అన్నిమతాలను సమానంగా చూడటం అన్న ఒక తప్పుడు అర్దాన్ని చెప్పాడు . దాన్నిపట్టుకొని వీళ్లంతా వేలాడుతున్నారు ఏమైనా లడ్డులసంగతి టీటీడి చూసుకుంటది ఒక మంత్రిగా ఉపముఖ్యమంత్రి ఇలా దీక్షలు చెయ్యటం సరికాదు .ప్రతిపక్షం వాళ్లు దీక్షలు చెయ్యాలి అధికారపక్షం వాళ్లు తప్పుచేసినవారిని వెతికి, పట్టుకొని శిక్షించాలి.

నార్నెవెంకటసుబ్బయ్య
9290617819

సూర్య
విజయవాడ
బుధవారం
25 సెప్టెంబర్ 2024


# నేడే జమ్మూ కశ్మీర్‌లో రెండో విడత పోలింగ్



శ్రీనగర్:జమ్మూ కాశ్మీర్లో బుధవారం రెండో విడత పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు తీసుకుని బూత్ సెంటర్లకు చేరుకున్నారు. 90 నియోజకవర్గాలున్న జమ్మూకాశ్మీర్లో మూడు విడతల్లో పోలింగ్ జరుగుతోంది.తొలి విడత సెప్టెంబర్ 18న ప్రశాంతంగా ముగిసింది. రెండో విడత 25న జరగనుంది. ఇందుకోసం ఏర్పాట్లన్నీ అధికారులు పూర్తి చేశారు. బుధవారం జమ్మూ కాశ్మీర్లోని ఆరు జిల్లాల్లో 26 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా భద్రతా సిబ్బంది మోహరించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపిస్తున్నారు. రాజౌరీ జిల్లాలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎన్నికలు జరిగే స్థానాలు:: కంగన్,మెంధార్,రాజౌరి,బుధాల్, తన్నమండి,సురంకోట్,చదూరా మరియు గులాబ్ఘర్ (ఎస్టీ), గందర్బల్, హజ్రత్బాల్, ఖన్యార్, హబ్బకదల్, లాల్ చౌక్, చన్నపోరా, జదిబాల్, ఈద్గా, సెంట్రల్ షాల్టెంగ్, బుద్గామ్, బీర్వా, ఖాన్సాహిబ్, చ్రార్-ఐ-షరీఫ్, రియాసి, శ్రీ మాతా వైష్ణో దేవి, కలకోటే-సుందర్బని, నౌషేరా,, పూంచ్ హవేలీల్లో ఎన్నికలు జరగనున్నాయి.మాజీ ముఖ్యమంత్రి మరియు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లాతో సహా 239 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.ఒమర్.. బుద్గామ్, గందర్బల్ రెండింటి నుంచి పోటీ చేస్తున్నారు. నౌషేరా స్థానం నుంచి బీజేపీ అధ్యక్షుడు రవీందర్ రైనా పోటీ చేస్తున్నారు. సెంట్రల్ షాల్టెంగ్ నుంచి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా ఇతర ప్రముఖ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. 7జిల్లాల్లోని 24 నియోజకవర్గాల్లో 61.13 శాతం ఓటింగ్ నమోదైంది.మూడో విడత అక్టోబర్ 1న జరగనుంది.

# ప్రధాని మోడీ అమెరికా పర్యటన
# విజయవంతం



● ప్రపంచ నాయకుల తో ద్వైపాక్షిక సమావేశాలు ● ఎందరో దేశాధినేతలు.. మరెందరో సీఈవోలతో భేటీ ● అమెరికా సహా పలు దేశాలతో కీలక ఒప్పందాలు ● భారత్ లో పెట్టుబడులు పెట్టాలని అవకాశాలను తెలియజేసిన మోడీ ● ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో 3నెలల వ్యవధిలో మూడోసారి మోడీ భేటీ ●ఉక్రెయిన్ కోరిక మేరకు జెలెన్ స్కీతో సమావేశం..45 నిమిషాల పాటు చర్చలు

వాషింగ్టన్: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడు రోజుల అమెరికా పర్యటన విజయవంతంగా ముగిసింది, మోదీ యూఎస్ పర్యటనలో క్వాడ్ సమ్మిట్లో పాల్గొనడం, యూఎన్ జనరల్ అసెంబ్లీలో 'సమ్మిట్ ఫర్ ది ఫ్యూచర్' కార్యక్రమంలో ప్రసంగించడంతోపాటు అనేక మంది ప్రపంచ నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. అమెరికా పర్యటనలో చివరి రోజు బిజీబిజీగా గడిపారు ప్రధాని మోదీ.. అమెరికా టెక్ కంపెనీలు భారత్లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ప్రధాని మోదీ తన అద్భుతమైన పర్యటన ముగించుకుని న్యూఢిల్లీకి తిరిగి వస్తున్నారని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. అమెరికా పర్యటనలో ప్రధాని మోదీ ఎజెండా అనేక ముఖ్యమైన కార్యక్రమాలతో నిండిపోయింది. మొదటి రోజు, ఆస్ట్రేలియన్ ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాన మంత్రి ఫుమియో కిషిదాతో జో బిడెన్ స్వస్థలమైన విల్మింగ్టన్, డెలావేర్లో సమావేశమయ్యారు. అక్కడ నలుగురు నాయకులు క్వాడ్ సమ్మిట్కు హాజరయ్యారు. సమావేశం సందర్భంగా, జనరల్ అటామిక్స్ తయారు చేస్తున్న 31 ఎంక్యూ-9బీ సాయుధ డ్రోన్ల కొనుగోలుపై బిడెన్, మోదీ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. అంతేకాకుండా, రక్షణ హార్డ్వేర్ సరఫరాను పెంచడం గురించి కూడా ఇరువురు నేతలు చర్చలు జరిపారు. కాగా, అమెరికాకు స్మగ్లింగ్ చేసిన 297 పురాతన వస్తువులను బిడెన్ ప్రధాని మోడీకి తిరిగి ఇచ్చారు.క్వాడ్ సమ్మిట్ సందర్భంగా ఆస్ట్రేలియా, జపాన్ నాయకులతో మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. పరస్పర ప్రయోజనం కోసం సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని నిర్ణయించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును ప్రోత్సహించే లక్ష్యంతో చర్చలు జరిగాయి. క్వాడ్ సమ్మిట్లో, సహకారం, అనుసంధానం ద్వారా అభివృద్ధికి భారతదేశం నిబద్ధతను మోదీ నొక్కిచెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో క్యాన్సర్తో పోరాడటానికి క్వాడ్ క్యాన్సర్ మూన్షాట్ చొరవను కూడా సమ్మిట్ ప్రకటించింది. గర్భాశయ క్యాన్సర్తో పోరాడటానికి భారతదేశం 7.5 మిలియన్ డాలర్లను సాయం చేసకోవాలని క్వాడ్ దేశాలు నిర్ణయించాయి. అమెరికా పర్యటనలో రెండో రోజున, బోస్టన్, లాస్ ఏంజెల్స్ కొత్త కాన్సులేట్లను ప్రారంభిస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. భారతదేశం-అమెరికా సంబంధాలను బలోపేతం చేయడంలో భారతీయ-అమెరికన్ కమ్యూనిటీ వారి పాత్రను ప్రధాని మోదీ ప్రశంసించారు. వారిని భారతదేశ బ్రాండ్ అంబాసిడర్లుగా పిలుస్తున్నారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటన చివరి రోజు తయారీ, ఆవిష్కరణకు భారత్ను గమ్యస్థానంగా చూడాలని అమెరికన్ టెక్ కంపెనీలకు మోదీ విజ్ఞప్తి చేశారు. భారత్తో కలిసి అభివృద్ధి, డిజైన్, ఉత్పత్తి చేయాలని సూచించారు. అమెరికాలోని న్యూయార్క్లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాని మోదీ ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ దిగ్గజాలతో సమావేశమయ్యారు. అసెంచర్, అడోబ్, గూగుల్, ఐబీఎం సహ 15 ప్రఖ్యాత కంపెనీల సీఈఓలు, ఛైర్మన్లు ఇందులో పాల్గొన్నారు.

**రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆగేనా?:** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, ప్రధాని మోడీ మూడు నెలల వ్యవధిలో మూడోసారి భేటీ అయ్యారు. అమెరికా పర్యటన నుంచి తిరిగి వస్తుండగా.. సోమవారం న్యూయార్క్లో ప్రధాని మోడీ, జెలెన్స్కీ మధ్య సమావేశం జరిగింది. ఇద్దరి మధ్య దాదాపు 45 నిమిషాల పాటు సంభాషణ సాగిందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ఈ విషయంపై తాను చాలా మంది ప్రపంచ నాయకులతో మాట్లాడానని.. యుద్ధాన్ని ముగించడానికి ఏదో ఒక మార్గాన్ని కనుగొనవలసి ఉందని అందరూ అంగీకరించారని మోదీ జెలెన్స్కీకి చెప్పినట్లు తెలిపారు. ఇందుకోసం తమ ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయన్నారు. ఉక్రెయిన్ అభ్యర్థనపై జెలెన్స్కీతో భేటీ అనంతరం విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. ఉక్రెయిన్ కోరిక మేరకు ఈ సమావేశం జరిగిందని చెప్పారు. మోదీ గత నెలలో కీవ్లో ఉక్రెయిన్ నాయకుడిని కలిశారు. దానికి కొన్ని వారాల ముందు జూలైలో, ప్రధానమంత్రి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ను మాస్కోలో కలిశారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతికి మార్గాన్ని కనుగొనేందుకు ఎప్పుడూ మా మద్దతు ఉంటుందని మిస్రీ తెలిపారు. జెలెన్స్కీతో జరిగిన సమావేశంలో కూడా తాను ఎప్పుడూ శాంతి, శాంతి మార్గంలో నడవడం గురించే మాట్లాడినట్లు విక్రమ్ మిస్రీ చెప్పారు. ఈ రెండు అంశాలు పరస్పరం ముడిపడి ఉన్నందున శాంతి లేకపోతే సుస్థిరమైన అభివృద్ధి ఉండదని స్పష్టమవుతోందని మిస్రీ అన్నారు. వివాదాన్ని ముగించే మార్గాన్ని కనుగొనడంపై అందరి ప్రయత్నాలు కేంద్రీకృతమై ఉన్నందున యుద్ధం ముగుస్తుందో లేదో కాలమే చెబుతుందన్నారు. రష్యా చమురు దిగుమతులు తన యుద్ధ ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్దేశించినవి కాదన్న భారత్ వాదనను అంగీకరించారా అని అడిగిన ప్రశ్నకు.. మిస్రీ స్పందిస్తూ.. నేటి చర్చల్లో ఆ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు.మోడీ అమెరికా పర్యటన ముగిసిన అనంతరం ఆయన సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ఎక్స్లో ఓ పోస్ట్ చేశారు.

# మోడీ అమెరికాకు బాగా దగ్గరయ్యారు

### అమెరికా రాయబారి కీలక వ్యాఖ్యలు



న్యూయార్క్: భారత ప్రధాని అమెరికా పర్యటన సందర్భంగా అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. భారత దేశ చరిత్రలో అమెరికాకు బాగా దగ్గరైన ప్రధాని మోదీ అని, యూఎస్ చరిత్రలో భారత్కు బాగా దగ్గరైన అధ్యక్షుడు బైడెన్ అని ఆయన కొనియాడారు. ఇరు దేశాల ప్రజలకు ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న వీరిరువురి మధ్య చాలా స్నేహపూరిత సంబంధాలున్నాయని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యానికి, సంబంధాలకు వీరి మధ్య ఉన్న స్నేహమే కారణమని పొగిడారు. భారత్ అమెరికా మధ్య పెరుగుతున్న స్నేహపూర్వక సంబంధాలు రెండు దేశాల్లో వ్యూహాత్మక, ఆర్థిక, సాయుధ, సాంస్కృతిక సహకారంలో వృద్ధికి సహకరిస్తాయని గార్సెట్టి అన్నారు. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్లు సభ్యదేశాలుగా ఉన్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సును ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సహకారానికి శక్తివంతమైన వేదికగా పేర్కొన్నారు. "క్వాడ్ సదస్సు సభ్యదేశాల మధ్య ఒక విజన్, అభివృద్ధి, సహకారం, సమస్యల పరిష్కారం గురించి చర్చించే వేదిక. ఇండో-పసిఫిక్ సమస్యలకు పరిష్కారాలను రూపొందించడానికి మేము చురుగ్గా పని చేస్తున్నాం" అని గార్సెట్టి పేర్కొన్నారు. సదస్సు సందర్భంగా 'విల్మింగ్టన్ డిక్లరేషన్' పేరుతో సభ్యదేశాల నేతలు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. నాలుగు దేశాల కూటమి బలం మునుపటి కంటే పెరిగిందని క్వాడ్ పేర్కొంది. మానవ హక్కుల పరిరక్షణ, చట్టబద్ధ పాలన, ప్రజాస్వామ్య విలువలు, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలకు కట్టుబడి ఉంటామని, ఐరాస సహా ఎలాంటి ప్రపంచ వేదికల ద్వారా బలప్రయోగానికి పాల్పడబోమని పేర్కొంది.

# శ్రీలంక ప్రధానిగా హరిణి



కొలంబో: శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆమె ప్రమాణస్వీకారం చేశారు. సిరిమావో బండారు నాయకే (1994-2000) తర్వాత శ్రీలంకలో ప్రధాని పదవి చేపట్టిన మహిళా నేత హరిణి కావడం విశేషం. నేషనల్ పీపుల్స్ పవర్ కి చెందిన 54 ఏళ్ల హరిణి అమరసూర్యతో ఆ దేశాధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే, మరో ఇద్దరు నేతలను క్యాబినెట్ మంత్రులుగా నియమించారు. దీంతో శ్రీలంకలో దిసనాయకేతో పాటు మొత్తం నలుగురితో కూడిన క్యాబినెట్ కొలువుదీరింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన హరిణికి న్యాయ, విద్య, కార్మిక, పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక శాఖ, ఆరోగ్యం, పెట్టుబడులు వంటి కీలక శాఖలను కేటాయించారు. అధ్యక్ష ఎన్నికల అనంతరం అధికార మార్పిడిలో భాగంగా దినేష్ గుణవర్ధన తన ప్రధాని పదవికి నిన్న రాజీనామా చేసిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.

**భారత్-చైనా మధ్య మేం నలిగిపోదల్చుకోలేదు:** శ్రీలంకలో హక్కుల కార్యకర్తగా, యూనివర్సిటీ అధ్యాపకురాలిగా గుర్తింపు పొందిన హరిణి ఆ దేశ మూడో మహిళా ప్రధానిగా చరిత్ర లిఖించారు. మరోవైపు, ఎన్పీపీకి చెందిన ఎంపీలు విజిత హెరాత్, లక్ష్మణ్ నిపుణరచిచి క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో దిసనాయకే సంచలన విజయం సాధించి శ్రీలంక నూతన అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత పార్లమెంట్ను రెండు రోజుల్లో రద్దు చేస్తామని ఆయన సోమవారం వెల్లడించడంతో శ్రీలంకలో ముందస్తు పార్లమెంటు ఎన్నికలు నవంబర్లో జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# హర్యానా ప్రజలు 'డంకీ'లుగా మారుతున్నారు

● యువతకు బీజేపీ తీవ్ర అన్యాయం చేసింది ● ఉద్యోగాలు లేక విదేశాలకు వలసలు వెళ్తున్నారు ● విదేశాల్లో సరైన తిండి, చోటు లేక ఇబ్బంది పడుతున్నారు ● చాలా మంది చిత్రహింసలకు గురవుతున్నారు: రాహుల్ గాంధీ



చండీగఢ్: హర్యానా అసెంబ్లీ ఎన్నికలవేళ బీజేపీపై కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఉద్యోగ కల్పన గురించి బీజేపీపై విమర్శలు గుప్పించారు. దేశం, హర్యానాలోని యువతకు బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బీజేపీ సర్కారు ఉద్యోగాలు కల్పించట్లేదని మండిపడ్డారు. హర్యానాలోని ఎక్కువమంది యువత 'డంకీ'లుగా మారుతున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో వీడియోను షేర్ చేస్తూ 'హర్యానా ప్రజలు 'డంకీ'లుగా ఎందుకు మారుతున్నారు?' అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకపోవడం వల్ల వేరేదారిలేక వారు పనికోసం విదేశాలకు వెళ్తున్నారని ఆరోపించారు. అక్కడ సరైన తిండి, చోటు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చాలా మంది చిత్రహింసలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో తమ సమస్యలు చెప్పుకొని బాధ పడ్డారని తెలిపారు. హర్యానా నుంచి విదేశాలకు వెళ్లిన వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పేర్కొంటూ వారు మాట్లాడిన వీడియోను రాహుల్ గాంధీ షేర్ చేశారు. వీడియోలో కొందరు యువత మాట్లాడుతూ తమ సొంత రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఉండటం వల్ల తాము ఉపాధి కోసం అమెరికా వెళ్లాల్సి వచ్చిందని.. అక్కడ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఆ వీడియోనే ఎక్స్ లో పోస్టు చేశారు. బీజేపీ చేస్తున్న తప్పులకు యువత శిక్ష అనుభవిస్తున్నారని రాహుల్ గాంధీ అన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడ్తున్నారని అన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూసుకోవడానికి కూడా వారికి అవకాశం లేకుండా పోయిందన్నారు. హర్యానాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. యువత తమ కుటుంబాలకు దూరంగా ఉండే పరిస్థితి రాకుండా ఉండటమే తమ లక్ష్యమని అన్నారు. ఇకపోతే, అక్టోబరు 5న హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో, అధికార బీజేపీ నుంచి ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. రైతుల సమస్యలు, నిరుద్యోగం పేరుతో బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం సాగిస్తోంది. ఇకపోతే, ఉద్యోగావకాశాలు లేక ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలి వెళ్లేవారిని 'డంకీ'లుగా పిలుస్తారు.

# తాలిబన్లు రెచ్చిపోతున్నారు

### హాలీవుడ్ నటి మెరిల్ స్ట్రీప్



న్యూయార్క్: అఫ్గానిస్థాన్లో మహిళలపై తాలిబన్లు అనేక ఆంక్షలు పెడుతూ వారి హక్కులను కాలరాస్తున్నట్లు అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. వీటిపై అంతర్జాతీయ సమాజం కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇదే అంశంపై హాలీవుడ్ నటి, ఆస్కార్ అవార్డు గ్రహీత మెరిల్ స్ట్రీప్ ఐరాస వేదికగా స్పందించారు. అఫ్గాన్లో పిల్లులు కూడా స్వేచ్ఛగా తిరుగుతున్నాయని, అమ్మాయిల కంటే ఉడుతలకే హక్కులు ఎక్కువగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. "అఫ్గాన్లో నేడు మహిళల కంటే ఆడ పిల్లులకే ఎక్కువ స్వేచ్ఛ ఉంది. అవి బయట కూర్చొని సూర్యరశ్మిని ఆస్వాదించవచ్చు. పార్కుల్లోకి ఉడుతలు స్వేచ్ఛగా ఎగురుతూ తిరగొచ్చు. అక్కడ అమ్మాయి కంటే ఓ ఉడుతకే హక్కులు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే అక్కడి పార్కుల్లో బాలికలు, మహిళలకు ప్రవేశాలను తాలిబన్లు నిలిపేశారు. ఓ పక్షి అక్కడ స్వేచ్ఛగా పాడగలదు. కానీ, మహిళలకు కనీసం ఆ స్వేచ్ఛ కూడా లేదు" అని మెరిల్ స్ట్రీప్ ఆవేదన వ్యక్తం చేశారు. న్యూయార్క్లో ఐరాస సాధారణ సమావేశాల వేళ ఓ చర్చలో మాట్లాడిన ఆమె.. అంతర్జాతీయ సమాజం ఏకతాటిపైకి వస్తే అఫ్గాన్ మహిళలకు మళ్లీ స్వేచ్ఛావాయువులను అందించవచ్చన్నారు.అమెరికా బలగాలను ఉపసంహరించుకున్న తర్వాత తాలిబన్ల చేతుల్లోకి అఫ్గాన్ వెళ్లిపోయింది. ఆగస్టు 2021 నుంచి మొదలైన అఫ్గాన్ పాలనలో.. షరియా చట్టం పేరుతో మహిళలపై అనేక ఆంక్షలు అమలు చేస్తున్నారు. దీంతో బాలికలు చదువుకు దూరమయ్యారు. యూనివర్సిటీలతో పాటు ఉద్యోగాలకూ అనుమతించడం లేదు. కనీసం స్వేచ్ఛగా పాటలు పాడుకునే పరిస్థితి కూడా లేదు. కుటుంబ సభ్యులు మినహా ఇతర పురుషుల వైపు చూడటం, హిజాబ్ లేకుండా బయటకు వెళ్లడం, తమ గ్రంథాన్ని బహిరంగంగా పఠించడంపైనా నిషేధం విధించారు. ఇలా అనేక విధాలుగా మహిళలపై వివక్ష చూపుతున్న తాలిబన్లపై అంతర్జాతీయ సంఘాలు మండిపడుతున్నాయి.

# కర్ణాటక సీఎంకు హైకోర్టు షాక్

● తెరవెనక సిద్ధరామయ్య లేరంటే నమ్మలేం ● లక్షల పరిహారం కోట్లుగా ఎలా మారింది..? ● సిద్ధరామయ్యపై హైకోర్టు ప్రశ్నల వర్షం ● ఈ కేసుని విచారించాల్సిందే అని ఉత్తర్వులు



బెంగళూరు: కర్ణాటక రాజకీయాల్లో ముడా స్కామ్ కలకలం సృష్టిస్తోన్న తరుణంలో.. హైకోర్టులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ తగిలింది. ఆ కుంభకోణానికి సంబంధించి తనను విచారించేందుకు గవర్నర్ అనుమతి మంజూరుచేయడాన్ని సీఎం హైకోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఆ పిటిషన్ను తాజాగా కోర్టు కొట్టివేసింది. గవర్నర్ థావర్చంద్ గహ్లోత్, ముఖ్యమంత్రి, పిటిషనర్ల తరపు వాదనలు విన్న కోర్టు ఈ రోజుకు తీర్పు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. తాజాగా సీఎం పిటిషన్ను తోసిపుచ్చుతూ.. గవర్నర్ చర్యలు చట్టప్రకారం ఉన్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఆయన చర్యల్లో ఎలాంటి లోపాలు లేవని, ఈ కేసులో పేర్కొన్న అంశాలు విచారణ చేయాల్సి ఉందని స్పష్టం చేసింది. 'ముడా' స్థలాల కేటాయింపుల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుటుంబసభ్యులు లబ్ధి పొందటం, అందుకు ముఖ్యమంత్రి అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు దాఖలాలతో సామాజిక కార్యకర్త టి.జె.అబ్రహం గవర్నర్కు ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు స్నేహమయి కృష్ణ, ప్రదీప్కుమార్ ముఖ్యమంత్రిపై ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదుల మేరకు ఆగస్టు 16న సీఎంను విచారించాలంటూ గవర్నర్ ఆదేశించారు. ఈ ఆదేశాలను రద్దు చేయాలని మంత్రివర్గం తీర్మానించగా.. దానిని గవర్నర్ తోసిపుచ్చారు. దాంతో సీఎం హైకోర్టును ఆశ్రయించారు. ఈ తీర్పు సిద్ధరామయ్య భవిష్యత్తుకు ఎంతో కీలకమని రాజకీయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఆయన విచారణను ఎదుర్కోవాల్సి వస్తే రాజీనామా చేయాలన్న డిమాండ్ విపక్షాల నుంచే కాకుండా స్వపక్షం నుంచీ వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తోన్న ఎంతోమందిస్పందించే అవకాశాలు కన్పిస్తున్నాయి.హైకోర్టు తీర్పు నేపథ్యంలో కర్ణాటకలో రాజకీయ చర్చ మొదలైంది. సిద్ధరామయ్య ఇంటికి మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లారు. తదుపరి చర్యల గురించి కాంగ్రెస్ నేతలంతా చర్చిస్తున్నారు. సుప్రీంకోర్టుని సిద్ధరామయ్య ఆశ్రయిస్తారని తెలుస్తోంది. మరోవైపు హైకోర్టు తీర్పు సీఎంకి వ్యతిరేకంగా రావడంతో బీజేపీ తన స్వరాన్ని పెంచింది. సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎంకి చెంపపెట్టు అని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. గవర్నర్ చర్యల్లో ఎలాంటి తప్పు లేదని బీజేపీ కర్ణాటక చీఫ్ బీవై విజయేంద్ర అన్నారు.

# ఎన్ఆర్ఐ కోటా మోసం

● ఎంబీబీఎస్ ప్రవేశ నిబంధన పై సుప్రీంకోర్టు ● పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు షాక్ ● కోటా కింద అడ్మిషన్లో బంధువులను చేర్చుకోవడం సరికాదు ● ఇది డబ్బు సంపాదించుకునేందుకు ఒక ఎత్తుగడ ● విద్యా వ్యవస్థ బలహీనపడుతుంది: సుప్రీం



ఢిల్లీ: ఎంబీబీఎస్లో ఎన్ఆర్ఐ కోటా కింద అడ్మిషన్ల వియంలో పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్ఆర్ఐ కోటా నిర్వచనాన్ని విస్తరించాలన్న నిర్ణయాన్ని రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పంజాబ్ ప్రభుత్వం చేసిన అప్పీల్ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. ఎన్ఆర్ఐ కోటా విధానం మోసం తప్ప మరొకటి కాదని వ్యాఖ్యానించింది. దీనికి వెంటనే ముగింపు పలకాలని సూచించింది. ఎన్ఆర్ఐ కోటా కింద అడ్మిషన్లో బంధువులను చేర్చుకోవడం సరికాదని సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఇది డబ్బు సంపాదించుకునేందుకు ఒక ఎత్తుగడ లాంటిదని అభిప్రాయపడింది. దీని ద్వారా విద్యా వ్యవస్థ బలహీనపడుతుందని పేర్కొంది. పంజాబ్-హర్యానా హైకోర్టు ఆదేశాలను సమర్థిస్తున్నట్టు వెల్లడించింది. ఎన్ఆర్ఐల బంధువులు సైతం ఎన్ఆర్ఐ కోటా కింద ఎంబీబీఎస్ అడ్మిషన్లు పొందొచ్చని పంజాబ్ ప్రభుత్వం ఆగస్టు 20న ఓ నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. దీనిని పంజాబ్ హైకోర్టు ఈ నెల 11న రద్దు చేసింది. ఈ నేపథ్యంలోనే పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా..దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం పిటిషన్ను కొట్టి వేసింది. అయితే హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్లు ఈ కోటా ప్రవేశానికి విస్తృత నిర్వచనాన్ని అనుసరిస్తున్నాయని పంజాబ్ ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది వాదించగా అందుకు ధర్మాసనం ఏకీభవించలేదు.

# ఇటలీ ప్రధానిపై మస్క్ ప్రశంసలు



న్యూయార్క్: ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ పై స్పేస్ఎక్స్, ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ ప్రశంసలు కురిపించారు. ఓ అవార్డుల కార్యక్రమంలో ఆమెకు పురస్కారాన్ని అందజేసిన మస్క్.. ఆమె నిజాయతీపరురాలు అని కొనియాడారు.ఆమె మనసు చాలా అందమైనదని వ్యాఖ్యానించారు.ఇటలీకి తొలి మహిళా ప్రధానిగా ఘనత సాధించడంతో పాటు ఐరోపా సమాఖ్యకు బలమైన మద్దతు అందిస్తున్నందుకు గానూ మెలోనీకి అట్లాంటిక్ కౌన్సిల్ గ్లోబల్ సిటిజన్ అవార్డును ప్రకటించారు. న్యూయార్క్లో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని మస్క్ చేతుల మీదుగా ఆమె అందుకున్నారు. అనంతరం స్పేస్ఎక్స్ అధినేత మాట్లాడుతూ.. "బాహ్య సౌందర్యం కంటే ఆమె మనసు ఇంకా అందమైనది. అలాంటి వ్యక్తికి నేను అవార్డు అందించడం గర్వంగా ఉంది. రాజకీయ నాయకుల గురించి కొన్ని పదాలను ఎప్పుడూ చెప్పలేం. కానీ, మెలోనీ అలా కాదు. ఆమె నిజాయతీగల, విశ్వసనీయమైన వ్యక్తి" అని ప్రశంసించారు.ఇటలీలో తన వ్యాపారాన్ని విస్తరించాలని ఎలాన్ మస్క్ గత కొన్ని రోజులుగా ప్రయత్నిస్తున్నారు. ఈ విషయమై సెప్టెంబరు నెలాఖరులో మెలోనీని కలిసి చర్చించనున్నారు. అంతరిక్షం, కృత్రిమ మేధ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై వీరు చర్చించుకోనున్నట్లు అధికారిక వర్గాలు ఇప్పటికే వెల్లడించాయి.

ఇదిలా ఉండగా.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్నకు మస్క్ సంపూర్ణ మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనూ ఐరోపా దేశాల నేతల నుంచి ఆయనకు మద్దతు కూడగట్టేందుకు మస్క్ ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ రాజకీయ విధానాలకు మెలోనీ సానుకూలమే అయినప్పటికీ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఆమె ఎవరికీ మద్దతు ప్రకటించలేదు. ఇరు దేశాల మధ్య సుదీర్ఘ దౌత్య సంబంధాల దృష్ట్యా.. కొత్త ప్రభుత్వంతో తాను కలిసి పనిచేస్తానని మెలోనీ ఇప్పటికే ప్రకటించారు.

# ఐరాస వేదికపై గళమెత్తిన భారత మహిళ




● వేతనంతో కూడిన నెలసరి సెలవు కావాలి ● ఒడిశాకు చెందిన ఉద్యమకారిణి రంజితా ప్రియదర్శిని ● నెలసరి విషయంలో సమాజంలో అపోహలు తొలగించేందుకు పోరాటం చేస్తున్న రంజిత ● జీతం ఇవ్వకపోతే.. ఏ మహిళ కూడా ఆ సెలవు తీసుకోదు ● రెండోసారి ఐరాస సదస్సుకు హాజరైనందుకు గర్వంగా ఉంది: ప్రియదర్శిని

న్యూయార్క్ : నెలసరి రోజుల్లో మహిళలకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలంటూ ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఒడిశాకు చెందిన సామాజిక ఉద్యమకారిణి రంజితా ప్రియదర్శిని గళం విప్పారు. అప్పుడే మహిళలు జీతంలో కోత పడుతుందని ఆలోచించకుండా సెలవు తీసుకోగలుగుతారని వెల్లడించారు. అమెరికాలో న్యూయార్క్ నగరంలో 79వ సర్వసభ్య ప్రతినిధి సభలో 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నెలసరి విషయంలో సమాజంలో ఉన్న అపోహలను తొలగించేందుకు ఆమె కృషి చేస్తున్నారు."రెండోసారి ఐరాస సదస్సుకు హాజరైనందుకు గర్వంగా ఉంది. నెలసరి రోజుల్లో వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్నదే నా ప్రధాన లక్ష్యం. ఆ రోజుల్లో ఒకటి నుంచి రెండు రోజులు సెలవులు ఇవ్వాలి. జీతం ఇవ్వకపోతే.. ఏ మహిళ కూడా ఆ సెలవు తీసుకోదు. కెన్యాలో జరిగిన ఐరాస సదస్సులో తొలిసారి ఈ విషయం గురించి ప్రస్తావించాను" అని ప్రియదర్శిని తెలిపారు. కెన్యా సదస్సు అనంతరం ఒడిశా ప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకుందని ఆమె తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి పెయిడ్ పీరియడ్ లీవ్ ఇన్షియేటివ్ను అమలుచేసింది. అలాగే కర్ణాటక ప్రభుత్వం ఏడాదికి ఆ తరహాలో ఆరు సెలవులు ప్రకటించింది. కర్ణాటక ప్రభుత్వం చర్యను అభినందించిన ఆమె.. ఆ సెలవుల సంఖ్యను 12కు పెంచాలని కోరారు. తన పోరాటం వెనక వ్యక్తిగతంగా ఎదుర్కొన్న అనుభవాలు కారణమని ఆమె తెలిపారు. ఆ సమయంలో తాను సెలవు కోరినందుకు తన మేనేజర్ నుంచి అవమానం ఎదుర్కొన్నానని, ఆ తర్వాత తాను ఉద్యోగానికి రాజీనామా చేశానని వెల్లడించారు. ఆమె ప్రయత్నాలు నెలసరి ఆరోగ్యం గురించి చర్చించేలా, ఆ దిశగా నిర్ణయాలు తీసుకునేందుకు దోహదం చేస్తున్నాయి.

ఇదిలాఉంటే.. స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఒడిశా ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పిన సంగతి తెలిసిందే. ఉద్యోగినుల కోసం ఒక రోజు నెలసరి సెలవు పాలసీని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల కు ఇది వర్తిస్తుందని వెల్లడించింది. ఈ పాలసీ తక్షణమే అమల్లోకి వస్తుందని అప్పట్లో ప్రభుత్వం పేర్కొంది. మహిళా ఉద్యోగులు ప్రతినెలా తమ రుతుక్రమంలో తొలి లేదా రెండో రోజు ఈ సెలవు ను తీసుకునేలా దీన్ని రూపొందించినట్లు తెలిపింది. ఉద్యోగుల ఆరోగ్యం, శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.



### ఆంధ్రప్రదేశ్‌లో నామినేటెడ్

# పదవుల జాతర

**20 మంది ఛైర్మన్లతో తొలి జాబితా విడుదల**
**టిడిపికి 16, జనసేన 3 బిజేపి 1గా పోస్టులు**
**సామాన్య కార్యకర్తలకు, త్యాగాలు చేసిన వారికి పెద్ద పీట**

**ఆంధ్రప్రదేశ్‌లో నామినేటెడ్ పదవుల జాతర ప్రారంభమైంది. 20మందితో తొలి జాబితా విడుదలైంది. ఎన్డీఏ కూటమి పార్టీలలో పదవులు దక్కిన వారిలో 16మంది టీడీపీ నాయకులు, ముగ్గురు జనసేన, ఒక బీజేపీ నాయకుడు ఉన్నారు. సామాన్య కార్యకర్తలకు పెద్దపీట వేస్తూ పదవుల్ని భర్తీ చేశారు. మొత్తం 99 మందితో మొదటి నామినేటెడ్ పదవుల జాబితాను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. బీసీ, ఎస్సీ, మైనార్టీ, ఎస్టీలకు పెద్ద పీట వేశారు. 11 మంది క్లస్టర్ ఇంఛార్జ్ లకు పదవులు దక్కాయి. ఒక క్లస్టర్ ఇంఛార్జ్‌కు ఛైర్మన్ పదవి దక్కింది. 6 గురు యూనిట్ ఇంఛార్జ్‌లకు పదవులు దక్కాయి.20 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించారు, ఒక కార్పొరేషన్‌కు వైస్ ఛైర్మన్ వివిధ కార్పొరేషన్లు సభ్యులను ప్రకటించారు. ప్రకటించిన 99 పదవుల్లో యువతకు ప్రాధాన్యం ఇచ్చారు. మరిన్ని వివరాలలోకి వెళితే....**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో తెలుగుదేశం అధిష్టానం అసలు సిసలైన కార్యకర్తలకు అగ్ర తాంబూలం ఇచ్చింది. పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో కష్టపడిన సామాన్య కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పదవులు కట్టబెట్టారు. పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో కష్టపడిన సామాన్య కార్యకర్తలకు సీఎం చంద్రబాబు పదవులు కట్టబెట్టిన కట్టబెట్టారు. గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కించుకోలేక పోయిన వారికి.. పొత్తుల్లో టిక్కెట్లు త్యాగం చేసిన వారికి హై ప్రాధాన్యత ఇచ్చారు. ఈ జాబితాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ లకు ప్రభుత్వం చోటు కల్పించింది. సామాజిక సమతూకం పాటిస్తూ సోషల్ ఇంజనీరింగ్తో తొలి విడత ప్రకటించిన పదవులపై పార్టీ క్యాడర్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. మలిజాబితాపైనా ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు చేశారు.

**సీట్లు త్యాగం చేసిన వారికి ఇప్పుడు పదవుల్లో ప్రాధాన్యత..**

నెల్లూరు మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ ఇప్పుడు వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అయ్యారు.. ఎలక్షన్ ముందు నెల్లూరు రూరల్ టీడీపీ టికెట్ ఆశించారు. కానీ కోటంరెడ్డి కారణంగా ఆ సీటు దక్కలేదు. అయినప్పటికీ పార్టీ కోసం పనిచేసిన అజీజ్‌కు వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ఇచ్చారు. ఇక.. డోన్‌లో ముందుగా తెలుగుదేశం టికెట్ మన్నె సుబ్బారెడ్డికి అనౌన్స్ చేశారు.. కానీ తర్వాత కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డికి టికెట్ మార్చారు. పార్టీ కోసం త్యాగం చేసి పనిచేసిందుకు ఇప్పుడు సుబ్బారెడ్డికి నామినేటెడ్ పదవి దక్కింది. ఆయన సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ అయ్యారు. ఉండి నియోజకవర్గంలో మొన్నటి సిట్టింగ్ ఎమ్మెల్యేరామరాజు.. రఘురామకృష్ణంరాజు కోసం తన టికెట్ త్యాగం చేసినందుకు ఆయనకు కూడా నామినేటెడ్ పదవి దక్కింది రామరాజు ఇప్పుడు ఏపిఐఐసి ఛైర్మన్ అయ్యారు. ఇక.. కర్రోతు బంగార్రాజు నెల్లిమర్ల టీడీపీ టికెట్ ఆశించారు. కానీ పొత్తులో భాగంగా జనసేన నుంచి లోకం మధవి అక్కడ పోటీచేసింది. జనసేన కోసం సీటు త్యాగం చేసిందుకు కర్రోతు బంగార్రాజుకి కూడా ఇప్పుడు పదవి దక్కింది. ఆయన మార్క్‌ఫెడ్ ఛైర్మన్ అయ్యారు.

ఇక.. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ అనకాపల్లి టికెట్ వదులుకున్నందుకు ఆయన్నూ పార్టీ గుర్తించిందనే చెప్పాలి.. అనకాపల్లి టికెట్ జనసేన నేత కొణతాల రామకృష్ణకు వెళ్లడంతో పీలా గోవింద్‌కు కీలక పదవి ఇస్తామని అప్పుడే పార్టీ హామీ ఇచ్చింది. ఇప్పుడు అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఛైర్మన్‌గా పీలా గోవింద్‌కు పదవి దక్కింది.

ఇక మచిలీపట్నం ఎంపీ టికెట్ త్యాగం చేసినందుకు కొనకళ్ల నారాయణకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన ఆర్టీసీ ఛైర్మన్ అయ్యారు.



### బీజేపీలో సీనియర్లకు మరోసారి నిరాశ

ఇక పొత్తుల్లో భాగంగా బీజేపీ నేత లంకా దినకర్ కు ఇరవై సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ పదవి ఇచ్చారు. గతంలో సోము వీర్రాజు ఏపీ బీజేపీ చీఫ్ గా ఉన్నప్పుడు లంకా దినకర్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అమరావతికి అనుకూలంగా మాట్లాడు తున్నారని.. పార్టీ ఏ విధానం ప్రకటించకపోయినా మాట్లాడుతున్నారని చర్యలు తీసుకున్నారు. తర్వాత సస్పెన్షన్ ఎత్తివేశారు. 2019కి ముందు లంకా దినకర్ టీడీపీలో ఉండేవారు. అప్పుడు టీడీపీ ఓడిపోవడంతో ఆయన బీజేపీలో చేరిపోయారు. బీజేపీలో చాలా మంది సీనియర్లు పదవుల కోసం చూస్తున్నారు. మొదటి జాబితాలో లంకా దినకర్ కు మాత్రమే చాన్స్ దక్కింది. జనసేన పార్టీ తరపున మూడు కీలక కార్పొరేషన్లకు ఛైర్మన్ పదవులు ఇచ్చారు. తోట మెహర్ సీతారామ సుధీర్, తమ్మిరెడ్డి శివశంకర్, వేములపాటి అజయ్ కుమార్‌లకు ఈ పదవులు దక్కాయి.



పిల్లి మాణిక్యాల రావు (ఛైర్మన్)
లెదర్ ఇండస్ట్రీస్
డెవలప్‌మెంట్ కార్పొరేషన్



పీతల సుజాత (ఛైర్మన్)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి



తమ్మిరెడ్డి శివశంకర్ (జనసేన) ఛైర్మన్
ఆంధ్రప్రదేశ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం
ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్



తోట మెహర్ సుధీర్ (జనసేన) ఛైర్మన్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర
పౌర సరఫరాల కార్పొరేషన్



వజ్జా బాబురావు, ఛైర్మన్
ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్
కార్పొరేషన్ లిమిటెడ్



పీలా గోవింద సత్యనారాయణ (ఛైర్మన్)
ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
డెవలప్‌మెంట్ కార్పొరేషన్



వేములపాటి అజయ్‌కుమార్ (జనసేన)
ఛైర్మన్ ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ మౌలిక
సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్



కర్రోతు బంగార్రాజు (ఛైర్మన్)
ఆంధ్రప్రదేశ్
మార్క్‌ఫెడ్



మన్నె సుబ్బారెడ్డి (ఛైర్మన్)
ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్
కార్పొరేషన్ లిమిటెడ్



మంతెన రామరాజు (ఛైర్మన్)
ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
కార్పొరేషన్



నందం అబద్దయ్య (ఛైర్మన్)
పద్మశాలి సంక్షేమ మరియు
అభివృద్ధి సంస్థ



నూకసాని బాలాజీ (ఛైర్మన్)
ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్
కార్పొరేషన్



కొనకళ్ల నారాయణ,
ఛైర్మన్,
ఏపిఎస్ ఆర్టీసి



పిఎస్ మునిరత్నం
ఏపిఎస్ ఆర్టీసి
వైస్ ఛైర్మన్



1 ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు (ఛైర్మన్)
- అబ్దుల్ అజీజ్



అనిమిని రవినాయుడు (ఛైర్మన్)
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్)



బత్తుల తాతయ్య బాబు
ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డ్ (ఛైర్మన్)



బొరగం శ్రీనివాసులు (ఛైర్మన్)
షెడ్యూల్డ్ తెగల సహకార ఆర్థిక సహకారం



దామచర్ల సత్య (ఛైర్మన్)
ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్



దీపక్ రెడ్డి (ఛైర్మన్)
ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన ఎంటర్‌ప్రైజ్
డెవలప్‌మెంట్ కోసం సొసైటీ



లంకా దినకర్ ఛైర్మన్ (బీజేపీ)
7.20 పాయింట్ ఫార్ములా



## ద్రవిడ్ అంటేనే అభిమానం, గౌరవం : స్టీవ్ వా

బెంగళూరు: ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా భారత మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్.. మంగళవారం బెంగళూరులో కలుసుకున్నారు. ఆ ఫొటోలను వా తన ఇన్స్టాలో పోస్ట్ చేశాడు. ఈ సందర్భంగా ద్రవిడ్తో అతడికున్న అనుభవాలను అందులో పంచుకున్నాడు. గ్రౌండ్లో మేము ప్రత్యర్థులమే కానీ, ఆఫ్ ఫీల్డ్లో రాహుల్ ద్రవిడ్ నాకు మంచి స్నేహితుడు. ఒత్తిడిలో కూడా జట్టుని నడిపించగల సామర్థ్యం ఉన్న ఆటగాడు. అతడంటే నాకు చాలా అభిమానం, గౌరవం అంటూ రాహుల్పై ప్రశంసలు కురిపించాడు. భారత్-ఆస్ట్రేలియాల మధ్య మ్యాచ్లను అభిమానులు ఉత్కంఠతో చూస్తారు. భారత్లో ద్రవిడ్, ఆసీస్లో స్టీవ్ వా.. ఇద్దరూ వారి జట్లలో కీలకమైన ప్లేయర్స్. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో (2001) భాగంగా భారత్-ఆస్ట్రేలియాల మధ్య కోల్కతా వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్ను ఎవరూ మర్చిపోలేరు. ఈ మ్యాచ్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్లో 445 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇందులో స్టీవ్ వా 110 (203) అద్భుత ప్రదర్శన చేశాడు. తొలి ఇన్నింగ్స్లో 171 పరుగులకే భారత్ ఆలౌట్ అయింది. ఫాలో ఆన్ ఆడిన భారత్ను ద్రవిడ్ (180), వీవీఎస్ లక్ష్మణ్ (281) ఆదుకున్నారు. అంతేకాదు, మ్యాచ్ గెలవడంలో కీలక పాత్ర పోషించారు. అది ఇప్పటికీ క్రికెట్ చరిత్రలో గొప్ప సిరీస్గా పరిగణిస్తారు. ఈ సిరీస్ను భారత్ 2-1 తేడాతో గెలుపొందింది. వా, రాహుల్ ద్రవిడ్ తమ కెరీర్లో ముఖ్యంగా సుదీర్ఘ ఫార్మాట్ క్రికెట్లో ఎన్నో సిరీస్లు ఆడారు.

కాగా, 2003-2004లో టెస్టు సిరీస్ కోసం భారత్.. ఆస్ట్రేలియా పర్యటనకి వెళ్లింది. స్టీవ్ వా, రాహుల్ ద్రవిడ్ కలిసి ఆడిన చివరి సిరీస్ ఇదే. ఈ సిరీస్ చివరి టెస్ట్ మ్యాచ్లో స్టీవ్ వా భారత్పై 80 పరుగులు చేసి, టెస్ట్ క్రికెట్కు వీడ్కోలు పలికాడు. ఇదే మ్యాచ్లో భారత్ తరఫున ద్రవిడ్ 91 పరుగులు చేసి కీలక పాత్ర పోషించాడు.

# నేడే బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ భేటీ




- మరికొద్ది రోజుల్లో ఏజీఎం
- కొన్ని అంశాలపైనే చర్చలకు పరిమితం

ఢిల్లీ: బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ భేటీ బుధవారం జరగనుంది. ఐసీసీ ఛైర్మన్గా బీసీసీఐ కార్యదర్శి జైషా ఎన్నిక కావడంతో.. కొత్త కార్యదర్శి నియామకం తప్పనిసరి కానుంది. అయితే, ఈసారి సమావేశంలో దానిపై నిర్ణయం తీసుకొనే అవకాశం లేదని క్రికెట్ వర్గాల నుంచి వస్తున్న మాట. అసలు ఆ అంశమే చర్చకు రాకపోవచ్చని సమాచారం. ఐసీసీ ఛైర్మన్గా జైషా డిసెంబర్ 1 నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు. మరికొద్ది రోజుల్లో బెంగళూరు వేదికగా 93వ సాధారణ సర్వసభ్య సమావేశం (ఏజీఎం) నిర్వహించనుంది. ఆలోగా అపెక్స్ కౌన్సిల్ భేటీ జరగనుంది. ఇప్పటికిప్పుడు బీసీసీఐ కొత్త కార్యదర్శి నియామకంపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదు. ఏజీఎం వరకు కార్యదర్శిగా జైషానే కొనసాగుతారు. అయితే, అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఐపీఎల్ రిటెన్షన్, రైట్ టు మ్యాచ్ నిబంధనల గురించి కూడా చర్చకు రాకపోవచ్చని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి.

**బైజూస్తో పేమెంట్ సెటిల్మెంట్ కీలకం**

బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎనిమిది అంశాలపై చర్చ జరగనుందని సమాచారం. వాటిల్లో అత్యంత కీలకమైంది బైజూస్కు సంబంధించి పేమెంట్ను సెటిల్ చేసుకోవడం ఒకటి. బైజూస్తో బీసీసీఐ స్పాన్సర్షిప్ ఒప్పందం గతేడాది మార్చితోనే ముగిసింది. 2019 మార్చిలో బైజూస్తో బీసీసీఐ ఒప్పందం చేసుకుంది. ఆ తర్వాత ఒక ఏడాదిపాటు దానిని పొడిగించింది. కానీ, బైజూస్ మాత్రం 2022 సెప్టెంబర్ వరకే పేమెంట్ చేసింది. అక్టోబర్ 2022 నుంచి మార్చి 2023 వరకు ఉన్న బకాయిలను రాబట్టేందుకు ఏం చేయాలనే దానిపై అపెక్స్ భేటీలో చర్చ జరగనుంది. బెంగళూరులో కొత్తగా నిర్మించిన జాతీయ క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవంపైనా, ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయం రిన్నోవేషన్పైనా చర్చించనున్నారు.

## సింధు ఆటలో స్థిరత్వం తీసుకురావడమే నా గోల్ : అనూప్ శ్రీధర్



హైదరాబాద్ : భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు కు మాజీ ఆటగాడు అనూప్ శ్రీధర్ కొత్త కోచ్గా వ్యవహరించనున్నారని ఆమె తండ్రి పి.వి.రమణ వెల్లడించిన సంగతి తెలిసిందే. గచ్చిబౌలి స్టేడియంలో గత మూడు వారాలుగా శ్రీధర్ ఆధ్వర్యంలో ఆమె శిక్షణ పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త కోచ్ మీడియాతో మాట్లాడుతూ.. పీవీ సింధును మళ్లీ పోడియంపైకి తీసుకురావడమే తన గోల్ అని వెల్లడించారు. ఆమెలో విజయం సాధించాలనే తపన ఉందని, ఆటలో స్థిరత్వం తీసుకురావడంలో సహకరించడమే తన లక్ష్యమని తెలిపారు.

కొన్ని వారాల క్రితం నేను సింధు బృందంతో మాట్లాడాను. ఈ నెల ప్రారంభం నుంచి హైదరాబాద్లో గచ్చిబౌలి స్టేడియంలో నా వద్ద శిక్షణ పొందుతోంది. మాకు పురోగతి కనిపించింది. రెండు వారాల్లో ఐరోపాలో జరగనున్న టోర్నమెంట్లకు వెళ్లనున్నాం. మేం దీర్ఘకాలిక ఒప్పందంలో లేకపోవడంతో.. 2025 కోసం ప్లాన్ చేయడం కష్టం. వచ్చే ఏడాది జరగనున్న టోర్నమెంట్లలో మెరుగైన ప్రదర్శన చేయాలని ఆమె లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఆటలో స్థిరత్వం తీసుకురావడంపైనే ప్రధానంగా దృష్టిసారించాను. ఈ మూడు వారాల్లో పురోగతి కనిపించింది. కానీ, చేయాల్సింది చాలా ఉంది అని ఆయన మీడియాకు వెల్లడించారు. త్వరలో ఫిన్లాండ్లో జరిగే ఆర్కిటిక్ ఓపెన్తో సింధుతో అనూప్ పని చేయబోతున్నారని సింధు తండ్రి వెల్లడించారు. బెంగళూరులో ఇక సింధు శిక్షణ కొనసాగించదు. హైదరాబాద్లో ట్రైనింగ్లో పాల్గొంటుంది. ప్రస్తుత కోచ్ ఆగస్ సాంటసోతో ఒప్పందం ముగియనుండటంతో.. ఫిన్లాండ్లో జరిగే టోర్నీ వరకు సింధుకు కోచ్గా అనూప్ శ్రీధర్ వ్యవహరిస్తారు. గతంలో పని చేసిన కొరియా కోచ్ పార్క్ సంగ్ పేరు కూడా పరిగణనలోకి వచ్చినా, అతడిని కొనసాగించడం వల్ల సానుకూల ఫలితాలు రావట్లేదని భావించాం అని రమణ పేర్కొన్నారు. 2016 రియో ఒలింపిక్స్లో రజతం సాధించిన ఈ భారత స్టార్.. 2020 టోక్యో క్రీడల్లో కాంస్యం నెగ్గింది. 2024 పారిస్ క్రీడల్లో మాత్రం క్వార్టర్స్లోనే వెనుదిరిగింది.

## ఈ ఒక్క మైదానంతో ఏటా రూ.81 వేల కోట్ల ఆదాయం..!



మాంచెస్టర్: ఆటల్లో పెట్టుబడి ఎందుకు.. సొమ్ము దండగ అనే వారు తాజాగా ఆక్స్ఫర్డ్ ఎకనామిక్స్ రిపోర్టు చూస్తే కళ్లుతేలేస్తారు. ఒక్క ఫుట్బాల్ క్లబ్ అధీనంలోని మైదానాన్ని ఆధునికీకరిస్తే ఏకంగా ఏటా రూ.81 వేల కోట్ల ఆదాయం బ్రిటన్కు లభిస్తుందట. ఈ విషయం ఇప్పుడా దేశంలో సంచలనంగా మారింది. తాజాగా ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానం, చుట్టుపక్కల ఆధునికీకరణ ప్రాజెక్టు ఫీజబులిటీ స్టడీ రిపోర్టును క్లబ్ సమర్పించింది. దీనిని ఆక్స్ఫర్డ్ ఎకనామిక్స్ సంస్థ నిర్వహించింది. గ్రేటర్ మాంచెస్టర్ ప్రాంతం ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి ఈ మైదానం ఉపయోగపడుతుందని పేర్కొంది.

ఈ ప్రాజెక్టును మాంచెస్టర్ యునైటెడ్ సహ యజమాని, బిలియనీర్ జిమ్ రాట్క్లిఫ్ ముందుకు తీసుకెళుతున్నాడు. 2 బిలియన్ డాలర్లు వెచ్చించి లక్ష సీట్లతో సరికొత్త మైదానం నిర్మించడం లేదా ప్రస్తుతం ఉన్న 74 వేల సీట్ల ఓల్డ్ ట్రాఫోర్డు సామర్థ్యం పెంచే ప్రతిపాదనలున్నాయి. అదే సమయంలో మైదానం చుట్టుపక్కల ఉన్న అపార్ట్మెంట్లు, షాపింగ్ కాంప్లెక్సులు, ట్రాన్స్పోర్టు సౌకర్యాలను వివిధ రకాల ప్రయోజనాలకు వినియోగించడం వంటివి ఉన్నాయి. ఈ సరికొత్త ప్రణాళికల ప్రకారం 92 వేల కొత్త ఉద్యోగాలు వస్తాయని, 17,000 నూతన ఇళ్ల నిర్మాణం జరుగుతుందని అంచనావేశారు.

ఈ ప్రణాళికలకు గ్రేటర్ మాంచెస్టర్ స్థానికుల నుంచి బలమైన మద్దతు లభిస్తోంది. మేయర్ ఆండీ బర్న్హమ్ మాట్లాడుతూ బ్రిటన్లో జరుగుతున్న అతిపెద్ద ఆధునికీకరణ ప్రాజెక్టు ఇదే అవుతుంది. ప్రపంచంలో అత్యుత్తమ మైదానం ఫుట్బాల్ మైదానం నుంచి స్థానికులు కూడా లాభపడతారు అని వ్యాఖ్యానించారు. ఈ స్టేడియం ఆధునికీకరణ పనులపై ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ సంస్థ ఫోస్టర్ పార్ట్నర్స్ పనిచేస్తోంది.

## పంత్ యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలుస్తాడు



ఇస్లామాబాద్: భారత స్టార్ బ్యాటర్ రిషభ్ పంత్ మనో బలం అద్భుతమని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ వసీమ్ అక్రమ్ ప్రశంసించాడు. ఘోర ప్రమాదం నుంచి త్వరగా కోలుకుని రావడం.. సుదీర్ఘ ఫార్మాట్లో మళ్లీ సత్తా చాటడం సాధారణ విషయం కాదని అభిప్రాయపడ్డాడు. ఇరవై నెలల కిందట పంత్ రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఆ విషయం తెలియగానే ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు తీవ్ర మనో వేదనకు గురయ్యారు. పాక్లోనూ ఆందోళన చెందినట్లు అక్రమ్ వెల్లడించాడు. ఇప్పుడు సెంచరీతో ఫామ్లోకి రావడంతో ఆస్ట్రేలియా అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆ జట్టును హెచ్చరించాడు. గత సిరీస్లో పంత్ కీలక పాత్ర పోషించాడని గుర్తు చేశాడు.రిషభ్ పంత్ ఆటను చూస్తుంటే.. సూపర్ మ్యాన్లా అద్భుతం చేశాడు. ఆ ట్రాజడీ నుంచి బయటపడ్డాక ఆడిన తొలి టెస్టు మ్యాచ్. వన్డేలు, టీ20ల్లో ఆడటం వేరు. కానీ, సుదీర్ఘ ఫార్మాట్లో ఇటువంటి ప్రదర్శన చేయడం మామూలు విషయం కాదు. అతడు రోడ్డు ప్రమాదానికి గురైనప్పుడు పాక్లోనూ చాలా ఆందోళనకు గురయ్యాం. పంత్ త్వరగా కోలుకుని నేను పోస్టు కూడా పెట్టా. ఇప్పుడు అతడి ఆటను చూస్తుంటే ఆనందంగా ఉంది. టెస్టు క్రికెట్లో అద్భుతాలు సృష్టిస్తున్నాడు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ గడ్డపై సెంచరీలు బాదాడు. జేమ్స్ అండర్సన్, పాట్ కమిన్స్ వంటి పేస్ బౌలర్లపై రివర్స్ స్వీప్లు ఆడటం మరింత హైలైట్ అని వసీమ్ వ్యాఖ్యానించాడు.

## సర్ఫరాజ్కు మళ్లీ నిరాశ?




ఢిల్లీ: భారత యువ క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ను బంగ్లాదేశ్తో రెండో టెస్టు స్క్వాడ్ నుంచి రిలీజ్ చేసే అవకాశం ఉంది. దులీప్ ట్రోఫీ మూడో రౌండ్ మ్యాచ్ల కోసం ఇప్పటికే తొలి టెస్టు తుది జట్టులో అవకాశం కల్పించని విషయం తెలిసిందే. శుక్రవారం నుంచి (సెప్టెంబర్ 27) రెండో టెస్టు ప్రారంభం కానుంది. స్క్వాడ్లో ఎలాంటి మార్పులు ఉండవని ఇప్పటికే బీసీసీఐ వెల్లడించింది. వచ్చే నెల తొలిరోజున ఇరానీ ట్రోఫీ కూడా ప్రారంభం కానుంది. దీంతో సర్ఫరాజ్ ఖాన్ను రెండో టెస్టు స్క్వాడ్లో నుంచి రిలీజ్ చేయాలని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం. ఈ నిర్ణయమే తీసుకుంటే.. భారత తుది జట్టులోనూ పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని క్రికెట్ వర్గాల విశ్లేషణ. రెండో టెస్టుకు వేదికైన కాన్పూర్ పిచ్ పేస్కు అనుకూలంగా మారుస్తుందో... లేదో అనేది చూడాలి. ఒకవేళ ఫాస్ట్ బౌలింగ్కు సహకరించేలా పిచ్ను తయారుచేస్తే.. తొలి టెస్టులో బరిలోకి దిగిన తుది జట్టే రెండో మ్యాచ్లోనూ ఆడటం ఖాయం.

**రెస్టాఫ్ ఇండియాతో పోరు :** రంజీ ట్రోఫీ 2023-24 ఛాంపియన్ ముంబయి ఇరానీ ట్రోఫీలో అక్టోబర్ 1న రెస్టాఫ్ ఇండియాతో తలపడనుంది. అటల్ బిహారీ వాజ్పేయి ఏకనా స్టేడియం వేదికగా ఇరానీ ట్రోఫీ జరగనుంది. భారత చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ నిశితంగా ఈ అంశాన్ని గమనిస్తున్నాడు. చివరి క్షణంలో నెట్స్లో ఎవరికైనా గాయాలైనా.. ప్రధాన బ్యాటర్లకు ఫిట్నెస్ సమస్యలు ఎదురైతే సర్ఫరాజ్కు తప్పకుండా అవకాశం దక్కుతుంది. అలాకానిపక్షంలో ప్రధాన స్క్వాడ్ నుంచి సర్ఫరాజ్ను రిలీజ్ చేస్తారు. ఇరానీ ట్రోఫీలో ఆడేందుకు అనుమతి ఇవ్వనున్నారు. కాన్పూర్ నుంచి లఖ్నవూకు కేవలం గంట మాత్రమే ప్రయాణం. తుది జట్టుపై మ్యాచ్కు ముందే నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. కాబట్టి, రెండో టెస్టు ప్రారంభమైన తర్వాతనైనా సర్ఫరాజ్ అక్కడినుంచి కాన్పూర్కు వెళతాడు అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

### నాకే అవకాశం వస్తే.. ధోనీని జట్టులో ఉంచుకుంటా...

# విరాట్ని అమ్మేస్తా : వాన్




మెల్ బోర్న్: మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ.. దేశం కోసం ఎన్నో ట్రోఫీలు, టైటిల్స్ అందించిన గొప్ప ఆటగాళ్లు. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) విషయానికి వస్తే ఒక్కొక్కరూ ఒక్కో జట్టులో ఉన్నారు. అయితే.. వీరు ఐపీఎల్లో ఒకే జట్టులో ఉంటే? ఆ పరిస్థితుల్లో ముగ్గురిలో ఒక్కరినే ఆడాలించాల్సి వస్తే..? సాధారణంగా ఇలాంటి ప్రశ్నలు ఊహకే అందవు కదా. ఎందుకంటే దేశం తరఫున ప్రాతినిధ్యం వహించి కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకున్న చరిత్ర వాళ్లది. ఈనేపథ్యంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్, ఆస్ట్రేలియా లెజండరీ వికెట్ కీపర్ ఆడమ్ గిల్క్రిస్ట్కి ఓ పాడ్కాస్ట్లో ఈ ప్రశ్న ఎదురైంది. కాగా వాన్ ఈ ప్రశ్నకి తడబడకుండా సమాధానం ఇచ్చేశాడు. తానైతే ధోనీనే ఎంచుకుంటానని స్పష్టంచేశాడు.

ధోనీ, విరాట్, రోహిత్లో ఒక్కరినే ఆడించాల్సిన పరిస్థితే వస్తే నేను ధోనీని ఎంచుకోవడంలో సందేహమే లేదు. ఎందుకంటే కెప్టెన్గా దేశానికి రెండుసార్లు ప్రపంచకప్ అందించిన ఘనత అతడిది. వేరే ఎవ్వరూ జట్టుని అంత గొప్పగా నడిపించలేరు. ధోనీనే కెప్టెన్. అతడే ఆడాలి. అయితే మిగిలిన రోహిత్, కోహ్లిల్లో ఒకరిని వదులుకోవాల్సివస్తే.. కోహ్లిని వేరే ఫ్రాంచైజీకి అమ్మేస్తాను. ఎందుకంటే అతడు ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ ట్రోఫీ గెలవలేదు. రోహిత్ ఐదుసార్లు ముంబయి ఇండియన్స్కు కప్పు అందించాడు. ఎలాగూ కెప్టెన్ కూల్ను ఆడిస్తాను కాబట్టి రోహిత్ని ధోనీకి సబ్స్టిట్యూట్గా పెట్టుకుంటా.

ఐపీఎల్ చరిత్రలో కప్ గెలవకపోయినప్పటికీ 2008 నుంచి ఇప్పటివరకూ ఒకే ఫ్రాంచైజీకి ఆడిన ఏకైక ఆటగాడు విరాట్. కప్ మాత్రం గెలవలేదు. కానీ అతడి ఖాతాలో చాలా రికార్డులు ఉన్నాయి. ఐపీఎల్లో ఇప్పటివరకు 251 మ్యాచ్లు ఆడి 8004 పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లి అగ్రస్థానంలో ఉంటాడు. కాబట్టి అతడిని వేరే ఫ్రాంచైజీకి అమ్మడం వల్ల నాకు మంచి వ్యాపారం అవుతుంది. అతడి ద్వారా నేను చాలా డబ్బులు సంపాదించొచ్చు అని వాన్ సమాధానం ఇచ్చాడు. ఈ వ్యాఖ్యలను ఆడమ్ గిల్క్రిస్ట్ కూడా సమర్థించాడు. మైకెల్ వాన్ ఆలోచించే మాట్లాడతాడని ఆడమ్ తెలిపాడు.

ఐపీఎల్లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో రోహిత్, సీఎస్కే లెజెండ్ ధోనీ ముందుంటారు. ఐపీఎల్లో ఇప్పటివరకు 264 మ్యాచ్లు ఆడిన మహీ కీపర్గా అత్యధిక (190) ఔట్లు చేసి రికార్డు సృష్టించాడు. గత కొన్నేళ్లుగా టాప్ ఆర్డర్లో బ్యాటింగ్కి రాకపోయినప్పటికీ లీగ్లో 5,243 పరుగులు చేసిన బ్యాటర్గా నిలిచాడు. అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికినప్పటికీ ఐపీఎల్లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే.

## గూగుల్లో నా ప్రొఫైల్ విచిత్రంగా ఉంది



ముంబయి: గూగుల్ గతంలో తన ప్రొఫైల్ను ఇంటర్నెట్ పర్సనాలిటీ చూపిందని టీమ్ ఇండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్ వెల్లడించాడు. జట్టు ఆలరౌండర్ అశ్విన్ కారణంగా ఇప్పుడది కోచ్గా మారిందని పేర్కొన్నాడు.

తాజాగా బీసీసీఐ టీవీలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. నెల రోజుల క్రితం మా ఫ్రెండ్ గూగుల్లో నా పేరు టైప్ చేయగా.. ఇంటర్నెట్ పర్సనాలిటీ అని వచ్చిందని చూపాడు. అంటే ఏంటోనని నేను ఆశ్చర్యపోయాను. ఈ టాపిక్ను అశ్విన్ ప్రస్తావించడంతో ఇప్పుడు నా ప్రొఫైల్ను కోచ్గా సరిచేశారు. అశ్విన్కు ధన్యవాదాలు అని పేర్కొన్నాడు.

తొలి టెస్ట్ మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రెస్ మీట్లో అశ్విన్ మాట్లాడుతూ గూగుల్లో దిలీప్ ప్రొఫైల్ ఇంటర్నెట్ పర్సనాలిటీ అని చూపిస్తోందని పేర్కొన్నాడు. దానిని మార్చాలని కోరాడు. అతడు తమ సెలబ్రిటీ కోచ్ అని చెప్పాడు. ఈ విషయంపైనే తాజాగా దిలీప్ స్పందించాడు.

బంగ్లాదేశ్తో మొదటి టెస్టులో జట్టు ఫీల్డింగ్, క్యాచ్లపై దిలీప్ స్పందించాడు. ఆట విషయంలో విరాట్ పాటించే ప్రమాణాలను కొనియాడాడు. తొలి ఇన్నింగ్స్లో స్లిప్లో ఫీల్డింగ్ చేసే సమయంలో బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హసన్ క్యాచ్ అద్భుతమని పేర్కొన్నాడు. మీరు ఆ వీడియో తీక్షణంగా చూడండి. అతడు వికెట్ కీపర్ లైన్లో నిలబడి ఉన్నాడు. ట్రైనింగ్ సెషన్లో వాటినే మేం చర్చించుకొంటాము. విరాట్లా సాధన చేయడం.. అతడిలా ఆడటంతో ఎవరికీ సాధ్యంకాదు. మ్యాచ్ గెలిచేందుకు అతడు ఎంత తపిస్తాడో.. ట్రైనింగ్లోనూ అంతే అని దిలీప్ వివరించాడు.

# ‘విశ్వం’ నుంచి హార్ట్ టచ్చింగ్ సెకండ్ సింగిల్

మాచో స్టార్ గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల ఫస్ట్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ మూవీ ‘విశ్వం’. రీసెంట్‌గా రిలీజైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు మరింతగా పెంచింది. ఈ హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌ను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్‌పై టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. దోనేపూడి చక్రపాణి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ ‘మొరాకో మగువా’కు ట్రెమండస్ రెస్పాన్స్ రావడంతో మ్యూజికల్ ప్రమోషన్స్ చార్ట్ బస్టర్ నోట్ లో స్టార్ట్ అయ్యాయి. మేకర్స్ సెకెండ్ సింగిల్ ‘మొండి తల్లి పిల్ల నువ్వు’ సాంగ్ ని రిలీజ్ చేశారు. చేతన్ భరద్వాజ్ మదర్ ఎమోషన్ ని అద్భుతంగా ప్రజెంట్ చేసే హార్ట్ టచ్చింగ్ నంబర్ గా ఈ సాంగ్ ని కంపోజ్ చేశారు. ‘అడుగే తడబడితే.. ఇదిగో.. నీ వెనకే ఉంటానులే.. చిన్నారి తల్లి! కలకో భయపడకు.. ఎపుడూ.. నీ కునుకై ఉంటానులే ..చిన్నారి తల్లి! మొండి తల్లి పిల్ల నువ్వు’ అంటూ శ్రీ హర్ష ఈమని రాసిన లిరిక్స్ మనసుని హత్తుకున్నాయి. సాహితీ చాగంటి తన లవ్లీ వోకల్స్ తో కట్టిపడేశారు. మదర్, డాటర్ బ్యాక్ డ్రాప్‌లో వచ్చే ఈ సాంగ్ కథలోని ఎమోషనల్ డెప్త్‌ని తెలియజేస్తోంది. ఈ పాటలో పాపతో హీరో గోపిచంద్‌కు వున్న బాండింగ్‌ని రివిల్ చేయనప్పటికీ వారి మధ్య వుండే ఎమోషన్ చాలా క్యురియాసిటీని పెంచింది. ఈ సాంగ్ ఇన్స్టంట్ హిట్‌గా నిలిచింది.



# ‘ఊపిరి’ తర్వాత నాకు చాలా స్పెషల్ ఫిల్మ్ సత్యం సుందరం -హీరో కార్తి

హీరో కార్తీ, అరవింద్ స్వామి లీడ్ రోల్స్ లో రాబోతున్న హెూల్సమ్ ఎంటర్‌టైనర్ ‘సత్యం సుందరం’. 96 ఫేమ్ సి ప్రేమ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సూర్య, జ్యోతిక నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. సెప్టెంబర్ 28న ఈ సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ ని నిర్వహించారు. మాస్ కా దాస్ విశ్వక్ సేన్, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ స్పెషల్ గెస్ట్ లు పాల్గొన్న ఈ వేడుకు చాలా గ్రాండ్ గా జరిగింది. హీరో కార్తీ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఐ




లవ్ యు బ్రదర్స్. మీ ప్రేమకి థాంక్ యూ. మీరు లేకపోతే నేను లేను. ఈ ఈవెంట్ కి స్పెషల్ గెస్ట్ లుగా వచ్చిన విశ్వక్, ప్రశాంత్ వర్మ, సురేష్ బాబు గారు, సునీల్ గారికి అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇప్పుడు తెలుగు సినిమాలంటే బాహుబలి లాంటి బిగ్ స్కేల్ సినిమాలు ఐడెంటిటీ. కానీ కొన్ని రోజుల క్రితం ఇంకో ఐడెంటిటీ కూడా ఉండేది. కే విశ్వనాథ్ గారి సినిమాలు, పెద్దవంశి గారి సినిమాలు, వసంత కోకిల లాంటి సినిమాలు హార్ట్ కి క్లోజ్ అయిన ఎన్నో సినిమాలు ఇక్కడనుంచి వచ్చాయి. అలాంటి సినిమాలు చేయడం కుదరదా అనిపించేది. అప్పుడే 96 అనే అద్భుతమైన క్లాసిక్ సినిమా తీసిన డైరెక్టర్ దగ్గర నాకోసం ఒక కథ ఉందని విన్నాను. అయితే ఆ కథ ఆయన నాకు చెప్పలేదు. అన్నయ్య సూర్యకి ఈ స్క్రిప్ట్ ఇచ్చాను. ఆయనకి చాలా నచ్చింది. ఇలాంటి కథలు నీకే ఎలా దొరుతుతాయి? అని అన్నారు. ఇందులో ఇంకో ఇంపార్టెంట్ క్యారెక్టర్ ఉంది. అది అరవింద్ స్వామి గారు చేస్తేనే బావుంటుందని ఆయన దగ్గరికి తీసుకెళ్లాను. ఆయనకి చాలా నచ్చింది. ఇలాంటి కథ తన జీవితంలో జరిగిందని చెప్పారు. అది నాకు చాలా షాక్ అనిపించింది. అందరికీ పర్సనల్ గా కనెక్ట్ అయ్యే స్క్రిప్ట్ ఇది. అమ్మానాన్నలు బ్రదర్స్ సిస్టర్స్ ఎమోషన్స్ ని చూసాం. కానీ ఇప్పటివరకు కజిన్స్ ఎమోషన్ ని చూడలేదు. ఈ సినిమా చూశాక ప్రతి ఒక్కరూ వాళ్ల కజిన్స్ కి ఫోన్ చేసి మాట్లాడుతారు. కానీ ఇలాంటి సినిమాలు రావడం చాలా కష్టం. 96 ఎలా అయితే హార్ట్ కి నచ్చిందో. సత్యం సుందరం కూడా మీ మనసుకి నచ్చుతుంది. తప్పకుండా అందరూ సినిమా చూడండి. అందరికీ థాంక్యూ’ అన్నారు.



# ఎన్టీఆర్‌తో జర్నీ నాకెప్పుడూ స్పెషలే – దర్శకుడు కొరటాల శివ

మ్యాన్ ఆఫ్ మాసెస్ టైటిల్ పాత్రలో నటించిన భారీ బడ్జెట్ చిత్రం ‘దేవర’. కొరటాల శివ దర్శకత్వం వహించారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటించారు. నందమూరి కళ్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్27న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కొరటాల శివ ‘దేవర’ సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ...‘దేవర’ సినిమా రిలీజ్ డేట్ దగ్గర పడుతోంది. ఎగ్జామ్ రాసిన తర్వాత రిజల్ట్ కోసం వెయిట్ చేసేటప్పుడు ఉండే ఎగ్జయిట్‌మెంటో, నెర్వస్‌నెస్ ఏదైనా అనుకోవచ్చు.. మనసులో అలా ఉంది. ప్రతి సినిమా రిలీజ్‌కు ముందే ఉండేదే.

‘దేవర’ మూవీ కథ అంతా ఫిక్షనల్. ఎక్కడా నిజ ఘటనలను ఆధారంగా చేసుకోలేదు.

మనిషికి మితిమీరిన ధైర్యం కూడా కరెక్ట్ కాదు. అది మూరత్వం అవుతుంది. మనకు తెలియకుండానే మనలో ఓ భయం ఉంటుంది. దాన్ని గౌరవించాలని చెప్పటమే ‘దేవర’ కథ. భయం లేకుండా ఉండాలనుకోవటం తప్పు. లా ఆఫ్ ల్యాండ్ అనేది ఒకటి ఉంటుంది కదా. దాన్ని అందరూ పాటించాలి. అదే భయం అంటే. ఉదాహరణకు ట్రాఫిక్ దగ్గర రెడ్ సిగ్నల్ పడగానే అందరం ఆగుతాం. ఎందుకు ఆగాలి.. వెళ్లిపోవచ్చు కదా అనుకోవచ్చు. కానీ మనలో ఆగాలనే చిన్నపాటి భయం ఉంటుందిగా. అందుకే ఆగుతాం. అలాంటి భయం మనిషికి ఎంతో అవసరం.. మంచిది కూడా. అదే నేను ‘దేవర’ సినిమాలో చెప్పాను. జవాబుదారీతనం కూడా ఓ భయమే. ఇలాంటి భయం ఉండటం వల్ల మనం చేసే పనిని చెక్ చేసుకుని మంచి రిజల్ట్ పొందుతాం.

ఎన్టీఆర్‌రితో జర్నీ ఎప్పుడూ నాకు స్పెషలే. ఏ విషయం అయినా ఆయనతో డిస్కస్ చేసినప్పుడు బాగున్నా, బాగోలేక పోయినా డిప్లొమెటిక్‌గా సమాధానం చెప్పరు. ఓపెన్‌గా మనసులో ఉన్న భావాన్ని చెబుతారు. ‘దేవర’ లైన్ చెప్పినప్పుడు ఆయన స్పందించిన తీరుతోనే నెక్ట్స్ లెవల్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నాం.

‘దేవర’ సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లటానికే 6 నెలలు సమయం తీసుకున్నాం. సముద్రంపై ఎలా షూట్ చేయాలి.. అక్కడ లైటింగ్ వేరియేషన్స్ ఉంటాయి. మనం సముద్రాన్ని ఎలా క్రియేట్ చేసుకోవాలి..దాన్నెలా చేయాలనే అంశాలపై స్టడీ చేశాం. అందుకనే సమయం తీసకున్నాం. ఎందుకంటే ఇలా షూటింగ్ ఎవరూ చేయకపోవటం వల్ల మనకు సలహాలిచ్చేవాళ్లు లేరు. అందుకే సమయం పట్టింది.

మన టెక్నీషియన్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. చాలా టాలెంటెడ్. మనవాళ్లు ప్రిపరేషన్ లేకుండా వెళ్లినా ఎగ్జిక్యూట్ చేయగలరు. హాలీవుడ్ టెక్నీషియన్స్ అలా కాదు. వాళ్లు ప్రిపేర్ కాకపోతే భయపడిపోతారు. ప్రతీ సన్నివేశాన్ని రిహార్సల్స్ చేసుకుని వెళతారు. అదే లాస్ట్ మినిట్ టెన్షన్‌లోనూ పని చేయటం మన వాళ్లకు అలవాటే. అదే మన వాళ్లకు హాలీవుడ్ టెక్నీషియన్స్ తరహాలో ప్రిపరేషన్ టైమ్ ఇస్తే.. ఇంకా అద్భుతాలు చేస్తారు.

‘దేవర’ సెకండ్ షెడ్యూల్ సమయంలో ఇంత పెద్ద కథను మూడు గంటల్లోపు చెప్పగలమా! అనే అందరం అనుకున్నాం. ఎందుకంటే నెరేషన్ 4 గంటలుంది. పేపర్ మీద పెట్టినప్పుడు అది 6-7 గంటలు వస్తుంది. సెకండ్ షెడ్యూల్ అప్పుడే మూడు గంటల్లో ఈ కథను చెప్పలేమని అర్థమైంది. రెండు పార్టులు వద్దనుకునే రివర్స్‌లో వెళ్లాం.

# ‘జటాధర’ సెకండ్ పోస్టర్



వైవిధ్యమైన సినిమాలు, పాత్రలతో మెప్పిస్తోన్న నవ దళపతి సుధీర్ బాబు కథానాయకుడిగా రూపొందుతోన్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ ‘జటాధర’. అనౌన్స్‌మెంట్ నుంచి పాన్ ఇండియా సినీ ప్రేక్షకులను ఆకట్టుకుని భారీ అంచనాలు క్రియేట్ చేసుకున్న ఈ చిత్రం 2025 శివరాత్రి విడుదలకు సన్నద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా నుంచి విడుదలైన కొత్త పోస్టర్ సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్‌ను మరింతగా పెంచుతోంది. పౌరాణిక, ఫాంటసీ, డ్రామా అంశాల కలయికగా ఈ చిత్రం తెరకెక్కుతోందని విడుదలైన పోస్టర్ చూస్తుంటేనే అర్థమవుతుంది. అలాగే అందులో సుధీర్ బాబు సరికొత్త లుక్‌తో, శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నారని తెలుస్తుంది. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్ బాబు ప్రొడక్షన్ బ్యానర్‌పై జటాధర చిత్రం ఇండియన్ సినిమాల్లో ఓ బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేసేలా రూపొందుతోంది. ఈ తరహా చిత్రాల రూపకల్పనకు ఇది నాంది పలికేలా కనిపిస్తుంది. సూపర్ నేచురల్ శక్తితో అదరగొట్టే లుక్‌లో సుధీర్ బాబు కనిపిస్తున్నారు. అభిమానులు పోస్టర్‌ను చూసి సినిమాలో తన పాత్ర ఎలా ఉండబోతుందనే దానిపై ఇప్పటికే ఉహాగానాలు చేస్తున్నారు. ఈ విలక్షణమైన సినిమాను ఎప్పుడెప్పుడు సిల్వర్ స్క్రీన్‌పై చూద్దామా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# ‘శ్వాగ్’లో స్టోరీ, ఫన్ కి ఢోకా ఉండదు - డైరెక్టర్ హసిత్ గోలి

కింగ్ ఆఫ్ కంటెంట్ శ్రీవిష్ణు, ట్యాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి అప్ కమింగ్ హిలేరియస్ ఎంటర్ టైనర్ ‘శ్వాగ్’. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మీరా జాస్మిన్, దక్ష నాగర్కర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. శ్వాగ్ అక్టోబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ హసిత్ గోలి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

**ఈ సినిమా అనౌన్స్‌మెంట్ లో అచ్చ తెలుగు సినిమా అని చెప్పారు కదా.. మరి ‘శ్వాగ్’ అనే ఇంగ్లీష్ టైటిల్ పెట్టడానికి కారణం? ఇందులో తెలుగు ఇంపార్టెన్స్ ఎలా వుంటుంది?**



ఈ సినిమా నెరేషన్ విన్న వివేక్ అచ్చ తెలుగు సినిమాలా వుంది, టైటిల్ ఏమిటని అడిగారు. శ్వాగ్ అని చెప్పగానే ఆయన సర్‌ప్రైజ్ అయ్యారు. అలా అచ్చ తెలుగు సినిమాలా అనిపించడానికి కారణం వుంది. ఇందులో చాలా రూటెడ్ విషయాలు వుంటాయి. వంశ వృక్షం గురించి అందరికీ తెలిసే ఉంటుంది కానీ అది సినిమాల్లోకి తీసుకురావడం అరుదు. ఇందులో డిఫరెంట్ జనరేషన్స్ టచ్ చేశాం. సింగా క్యారెక్టర్ ప్రజెంట్ జనరేషన్. అలాగే 90కి సంబంధించిన క్యారెక్టర్ ఉంటుంది. దాని కంటే ముందుకు వెళితే 70కి సంబంధించిన క్యారెక్టర్ ఉంటుంది. ఇంకా ముందుకెళ్తే.. మూల పురుషుడికి సంబంధించినంత వరకు వెళ్దాం అనే ఆలోచనతో చేసిన స్క్రిప్ట్ ఇది. రాజులకు సంబంధించిన క్యారెక్టర్ గురించి చెప్తున్నప్పుడు ఇంగ్లీష్ అవసరం పడదు. అక్కడ స్వచ్ఛమైన తెలుగ ఉంటుంది. ఇందులో అచ్చ తెలుగు విషయాలే ఉన్నాయి. అలాగే రూటేడ్ కల్చర్ ఉంది. ఇది ఒక వంశానికి సంబంధించిన కథ. ప్రతి జనరేషన్ లో విష్ణు క్యారెక్టర్ ఉంటుంది.

**ఇందులో ఎలాంటి సందేశం ఉంటుంది?**

సందేశం కోసం తీసిన సినిమా కాదు ఇది. మగ-ఆడ గొడవ ఎప్పటి నుంచో ఉంది. ఎప్పటికీ ఉంటుంది. ఎప్పటికీ ఉండేది వంశం. ఈ రెండిటిని లింక్ చేసినప్పుడు చాలా ఎక్సైటింగ్‌గా కనిపించింది. మాతృస్వామ్య వ్యవస్థ అనేది అక్కడక్కడ కనిపిస్తుంది. దాన్ని ఎక్స్ ఫ్లోర్ చేయడం ఇంట్రెస్టింగ్ అనిపించింది. సందేశం కాదు గాని.. తరతరాలుగా మగ ఆడ గొడవ అనేది ఎలా మారుతూ వచ్చింది, ఇప్పటికి దాని రిలవెన్స్ ఏంటి అనే ఆలోచనతో చేసిన కథ.

**యయాతి, భవభూతి క్యారెక్టర్స్ గురించి ?**

యయాతి పేరు పురాణాలలో ఉన్నదే. యదు వంశానికి సంబంధించిన రాజు. ఈ సినిమాలో పేర్లని రిధమిక్ గా పెట్టాలని అనుకున్నాం. అందుకే భవభూతి. యయాతి పేర్లని క్యారెక్టర్స్ కి పెట్టాం. ఇందులో నాలుగు క్యారెక్టర్లకి సేమ్ ఇంపార్టెన్స్ ఉంటుంది. ఆ నాలుగు క్యారెక్టర్స్ కలిసి ఎలాంటి కథ చెప్పబోతున్నారనేది చాలా ఇంట్రెస్టింగ్.

**రీతూ వర్మ క్యారెక్టర్ గురించి ?**

రీతుకి స్ట్రాంగ్ లేడీ స్క్రీన్ పర్సోనా వుంది. వింధ్యామర వంశ రాణిగా కనిపిస్తారు. ఈ క్యారెక్టర్ ని ఆమె చేస్తేనే పర్ఫెక్ట్ అనుకున్నాం. చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు.

# “క” షూటింగ్ పూర్తి త్వరలో రిలీజ్



యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా “క”. ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో ”క” సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమాను త్వరలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకురాబోతున్నారు. “క” సినిమాను తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిలింస్ పై రిలీజ్ చేయబోతున్నారు. తాజాగా “క” సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఎన్నో అందమైన లొకేషన్స్, భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో పీరియాడిక్ బ్యాక్ డ్రాప్ లో బ్యూటిఫుల్ ఆర్ట్ వర్క్ తో ఈ సినిమాను అనుకున్న టైమ్ కు పూర్తి చేయగలిగారు మూవీ టీమ్. “క” సినిమా ఔట్ పుట్ పట్ల మేకర్స్ పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

# షూటింగ్ పూర్తి చేసుకున్న లైఫ్

మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, అన్నపరెడ్డి స్టూడియోస్ పై కిషోర్ రాఠీ, మహేష్ రాఠీ మరియు ఏ. రామస్వామి రెడ్డి నిర్మాతలుగా పవన్ కేతరాజు దర్శకత్వంలో శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా వస్తున్న సినిమా లైఫ్ (లవ్ యువర్ ఫాదర్). ఎస్. పి. చరణ్, నవాబ్ షా, ప్రవీణ్, భద్రం, రఘుబాబు, షకలక శంకర్, రియా, సంధ్య ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. మణిశర్మ సంగీతం సమకూరుస్తున్న ఈ సినిమా షూటింగ్ నేటితో పూర్తయింది. అతి త్వరలో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా మూవీ టీం మీడియాతో ముచ్చటించారు. దర్శకుడు పవన్ కేతరాజు మాట్లాడుతూ : కొడుకు బాధ్యత తీర్చేందుకు తండ్రి పడే ఆరాటం తండ్రి కోసం కొడుకు చేసే పోరాటం మా ఈ లైఫ్ సినిమా. కథ అంతా కాశి బ్యాక్ డ్రాప్ లో జరుగుతూ శివతత్వాన్ని చూపించే చిన్న ప్రయత్నం చేశామన్నారు. ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాగా ఈ సినిమాని తీస్తున్నాం. హీరో శ్రీహర్ష మొదటి సినిమా అయినా చాలా బాగా నటించాడు. హీరో తండ్రి పాత్రలో ఎస్పి చరణ్ గారు ఈ సినిమాకి చాలా ప్లస్ అయ్యారు. రఘు బాబు గారు, షకలక శంకర్, ప్రవీణ్ కామెడీ టైమింగ్ చాలా బాగుంటుంది. శ్యామ్ కె నాయుడు గారు సినిమాటోగ్రఫీ విజువల్ వండర్ లా ఉంటుంది అన్నారు.

**PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD**, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **PRINTED AT SPR PRINTING PRESS,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081**, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081**. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232** RNI Registration No. **APTEL/2007/22044**